ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 తమిళనాడు TAMILNADU
బుధవారం 25 డిసెంబరు 2024

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి దిన పత్రిక కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఏవైనా సమస్యలుంటే క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
A.C.O - 9003200801
S.R - 9551168092
27/11, సౌందరరాజన్ స్ట్రీట్, టి.నగర్, చెన్నై-600017



ముఖ్యమంత్రి స్టాలిన్‌కు పెరియార్ ఉపయోగించిన ఊతకర్ర కానుకగా అందజేస్తున్న ద్రావిడ కళగం నేత వీరమణి

ద్రావిడ పాలనను అపహాస్యం చేస్తే పెరియార్ బడిత పూజే శరణ్యం!

● సీఎం స్టాలిన్

చెన్నై, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ద్రావిడ తరహా పరిపాలనను అపహాస్యం చేస్తున్నవారికి ఇక ద్రవిడ ఉద్యమ నేత పెరియార్ ఊతకర్రే తగిన విధంగా సమాధానం చెబుతుందని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ వ్యాఖ్యానించారు. పెరియార్ 51వ వర్ధంతి సందర్భంగా వేప్పేరిలోని పెరియార్ థిడల్‌లో ద్రావిడ కళగం ఆధ్వర్యంలో నిర్మించిన పెరియార్ గ్రంథాలయ పరిశోధన కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ద్రావిడ కళగం నేత కె.వీరమణి ముఖ్యమంత్రికి పెరియార్ ఉపయోగించిన ఊతకర్రను బహుమానంగా అందజేశారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ. తన జీవితంలో ఇప్పటి వరకు వివిధ ప్రముఖులు, సంస్థలు, సభల నుంచి అందుకున్న కానుకల కంటే పెరియార్ ఊతకర్ర అత్యంత విలువైన, పది కాలాలపాటు దాచుకోవాల్సిన అరుదైన కానుకగా భావిస్తున్నానన్నారు. పెరియార్ స్మారక స్థలానికి వస్తే పుట్టినింటికి వచ్చినంత ఆనందం కలుగుతుందన్నారు. పెరియార్ కాలధర్మం చేసి ఐదు దశాబ్దాలు దాటినా, రాష్ట్ర ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని తెలిపారు. పెరియార్ ఆశయాలను మాజీ ముఖ్యమంత్రులు అన్నాదురై, కరుణానిధి ఆచరించారని, తాను కూడా ఆ మహాపురుషుల అడుగుజాడలలోనే నడుస్తున్నానని స్టాలిన్ పేర్కొన్నారు. ఇటీవల కేరళలోని వైక్కమ్ వద్ద కొత్త మెరుగులు దిద్దుకున్న పెరియార్ స్మారక మండపాన్ని తాను ప్రారంభించినప్పుడు తనతోపాటు వచ్చిన వీరమణి పట్టరాని సంతోషాన్ని వ్యక్తం చేశారన్నారు. ప్రస్తుతం 90వ వడిలో ఉంటూ పెరియార్ ఆశయాలు, సిద్ధాంతాలపై విస్తృత ప్రచారోద్యమం సాగిస్తున్న వీరమణి నిండునూరేళ్ల వర్ధిల్లాలని స్టాలిన్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దురైమురుగన్, పీకే శేఖర్‌బాబు, కయల్‌విళి సెల్వరాజ్, ఎంపీ రాజా, మేయర్ ఆర్.ప్రియ, ఎమ్మెల్యేలు తాయగం కవి, ఎ.వెట్రిఅళగన్, జోసెఫ్ సామువేల్, ద్రావిడ కళగం ఉపాధ్యక్షుడు కలి పూంగుండ్రన్, ప్రధాన కార్యదర్శి వి. అన్బురాజ్ తదితరులు పాల్గొన్నారు.


● నేడే క్రిస్మస్..
క్రిస్మస్ ప్రత్యేక ప్రార్థనలకు ముస్తాబైన మైలాపూర్ శాంథోం చర్చి



చూళైమేడులో క్రైస్ట్ చర్చి

క్రీస్తు జన్మదినం క్రైస్తవులకు పర్వదినం

అర్ధరాత్రి నుంచే చర్చిల్లో ప్రార్థనలు ● రాష్ట్ర వ్యాప్తంగా భారీ పోలీసు బందోబస్తు

ప్యారీస్, డిసెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): ఏసుక్రీస్తు జన్మదినాన్ని జరుపుకొనేందుకు రాష్ట్ర వ్యాప్తంగా క్రైస్తవులు సన్నద్ధమయ్యారు. మంగళవారం అర్ధరాత్రి నుంచి ప్రత్యేక ప్రార్థనలకు చర్చిలు ముస్తాబయ్యాయి. ఈ క్రిస్మస్ సంబరాలను ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా పోలీసు శాఖ నిఘా ముమ్మరం చేసింది.. రాజధాని నగరంలో సుమారు 8 వేలకు పైగా పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా, క్రిస్మస్ పర్వదినం అందరి జీవితాల్లో ఆనందం తీసుకురావాలని ఆకాంక్షిస్తూ ముఖ్యమంత్రి సహా పలువురు నేతలు వేర్వేరుగా శుభాకాంక్షలు తెలియజేశారు.


మెహతానగర్ మేరీమాత చర్చ్

మొదలైంది. చర్చి ప్రాంగణాలను స్టార్లు, పశువుల పాక, బెల్స్, క్రిస్మస్ ట్రీ, వివిధ అలంకరణ సామగ్రితో అలంకరించారు. బిసెంట్ నగర్‌లోని అన్నై వేలాంకన్ని చర్చి, శాంథోం చర్చి, సైదాపేట లిటిల్ మౌంట్ చర్చి, సెయింట్ థామస్ చర్చి, జెమిని సర్కిల్‌లోని కెథడ్రల్ చర్చి, పెరంబూర్ పెయింట్ పీటర్స్ చర్చి, వాటర్ బరి మెమోరియల్ తెలుగు బాప్టిస్ట్ చర్చి, వెపేరిలోని మద్రాస్ సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ చర్చి, ఈసీఐ, సీఎస్ఐ, లూథరన్, మారనాథ, కల్వరి, తదితర చర్చిల్లో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

గ్రేటర్‌లో సందడి...

క్రిస్మస్ పండుగను బుధవారం జరుపుకోనున్న సందర్భంగా గ్రేటర్ చెన్నైలోని చర్చిలు, క్రైస్తవులు నివసిస్తున్న ప్రాంతాల్లో సోమవారం నుంచే సందడి

నేతల శుభాకాంక్షలు...

మత సామరస్యానికి క్రిస్మస్ నిదర్శనం

క్రీస్తు పుట్టుక సందర్భంగా అందరూ సమైక్యంగా పండుగ జరుపుకోవాలి. 2021వ సంవత్సరం అధికారం చేపట్టిన డీఎంకే ప్రభుత్వం మైనార్టీ విద్యార్థులకు హాస్టల్, పండుగ రోజుల్లో ప్రత్యేక భోజనం తదితర వసతులు కల్పించాం. జెరూసలేం యాత్రకు నిధులు సమకూర్చడంతో పాటు అన్ని వర్గాల ప్రజలకు సమానంగా ప్రభుత్వ ఫలాలు అందిస్తున్నాం. క్రిస్మస్ పండుగ జరుపుకుంటున్న క్రైస్తవులకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. - సీఎం స్టాలిన్

ప్రపంచ దేశాల్లో శాంతి నెలకొనాలి

క్రిస్మస్ సందర్భంగా ప్రపంచ దేశాల్లో దాడులు, అల్లర్లు, విధ్వంస కాండలు సద్దుమనిగి శాంతి నెలకొనాలి. అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో క్రైస్తవులు, ఇస్లామీలు లబ్దిపొందేలా దివంగత మాజీ ముఖ్యమంత్రులు ఎంజీఆర్, జయలలిత అందించిన పథకాలను గుర్తుచేసుకోవాలని, ప్రతిఫలం ఆశించకుండా సమాజానికి సేవ చేయాలని క్రిస్మస్ సందర్భంగా అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి శుభాకాంక్షలు తెలియజేశారు.. అదేవిధంగా మాజీముఖ్యమంత్రి ఒ.పన్నీర్ సెల్వం, టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వ పెరుందగై, పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రామదాస్, ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో, డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత సహా పలు పార్టీల నేతలు క్రైస్తవులకు శుభాకాంక్షలను తెలుపుతూ వేరువేరు ప్రకటనలు విడుదల చేశారు.

డెల్టా జిల్లాల దిశగా అల్పపీడనం



● రేపు, ఎల్లుండి భారీ వర్షసూచన

చెన్నై, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఆంధ్రా కోస్తాతీరం దిశగా వెళ్ళి, తీరం దాటకుండా రాష్ట్రం వైపు మళ్ళిన అల్పపీడనం ప్రస్తుతం డెల్టాజిల్లాల వైపు కదులుతున్నట్లు వాతావరణ కేంద్రం అధికారులు ప్రకటించారు.

ఆదివారం పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం పశ్చిమ నైరుతి దిశగా పయనించి సోమవారం మధ్యాహ్నానికి బంగాళాఖాతంలో ప్రవేశించి రాష్ట్రంలోని ఉత్తర జిల్లాల దిశగా కదిలింది. మంగళవారం మధ్యాహ్నాం ఆ అల్పపీడనం పశ్చిమ నైరుతి దిశగా పయనించి డెల్టా జిల్లాల వైపు పయనిస్తోంది. నగరానికి 500 కి.మీ.ల దూరంలో ఉన్న తీవ్ర అల్పపీడనం బుధవారం తీరానికి చేరువగా రానుంది. గురువారం డెల్టా జిల్లాల్లో తీరం దాటి బలహీనపడి అరేబియా సముద్రం వైపు వెళ్తుందని అధికారులు చెబుతున్నారు. ఈ తీవ్ర అల్పపీడనం ప్రభావంతో నగరం సహా, పరిసర జిల్లాల్లో మంగళవారం ఉదయం చెదురుమదురుగా వర్షాలు కురిశాయి. ఈ నెల 26, 27 తేదీల్లో రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో భారీగా, ఓ మోస్తరుగా వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం అధికారులు ప్రకటించారు. ఈ నెల 28న పడమటి కనుమల్లోనూ భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నట్టు తెలిపారు. తీవ్ర అల్పపీడన ప్రభావం వల్ల చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు, కాంచీపురం సహా సముద్రతీర జిల్లాల్లో చెదురుముదురుగా వర్షాలు కురుస్తాయన్నారు.

ఎల్లుండి రాష్ట్రానికి అమిత్ షా



పెరంబూర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఈ నెల 27న రాష్ట్రంలో పర్యటించనున్నారు. ప్రత్యేక విమానంలో నగరానికి చేరుకోనున్న కేంద్రమంత్రి.. ఇక్కడి నుంచి హెలికాప్టర్‌లో తిరువణ్ణామలై వెళ్లనున్నారు. 28వ తేది తిరువణ్ణామలైలో కొత్తగా నిర్మించిన బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు. అనంతరం పార్టీ నిర్వాహకులతో ఆయన సమావేశం కానున్నారు. అరుణాచలేశ్వరుడిని దర్శించుకోనున్నారు.

నల్లజెండాలతో నిరసన: కాంగ్రెస్

రాష్ట్రానికి వచ్చే కేంద్రమంత్రి అమిత్ షాకు నల్లజెండాలతో నిరసన తెలపాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సెల్వపెరుందగై విడుదల చేసిన ప్రకటనలో... పార్లమెంటు సాక్షిగా అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు ఆయన భేషరతు క్షమాపణ చెప్పాలంటూ నిరసన చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

ప్రధానితో గవర్నర్ భేటీ

● అసెంబ్లీ సమావేశాల ముందు కలవడంతో సర్వత్రా ఉత్కంఠ


ప్రధాని మోదీని కలుసుకున్న గవర్నర్ రవి

చెన్నై, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి మంగళవారం ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోదీతో భేటీ అయ్యారు. వచ్చే నెల 6వ తేదీ ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల్లో ఆయన ప్రసంగించాల్సివున్న నేపథ్యంతో ప్రధానితో భేటీ కావడం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశమైంది. నాలుగు రోజుల పర్యటన నిమిత్తం ఆదివారం ఢిల్లీ వెళ్లిన గవర్నర్.. మంగళవారం ఉదయం ప్రధానితో అరగంటకు పైగా సమావేశామయ్యారు. అంతేగాక ఆయన పలువురు కేంద్రమంత్రులతోనూ భేటీ అయ్యారు. గవర్నర్ రవి ప్రతి నెలా ఢిల్లీ వెళ్తున్నప్పటికీ ఆయన తన వ్యక్తిగత కార్యకలాపాలను చూసుకుని తిరిగి వస్తున్న విషయం తెలిసిందే. అయితే అసెంబ్లీ సమావేశాలకు ముందు ఈ సారి ఆయన ప్రధానితో భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. గత ఏడాది అసెంబ్లీలో గవర్నర్ వ్యవహరించిన తీరు పలు వివాదాలకు దారితీసింది. పలు పార్టీలు ఆయన తీరును తప్పుబట్టాయి. ఇప్పుడు మళ్లీ ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల్లో గవర్నర్ వ్యవహారశైలి ఎలా ఉండబోతోందన్నది చర్చ జరుగుతోంది. గవర్నర్ గతంలోలానే వ్యవహరిస్తే, తాము కూడా దీటైన జవాబు ఇస్తామని ఇప్పటికే పలువురు మంత్రులు బహిరంగంగానే ప్రకటించారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీలో వ్యవహరించాల్సిన తీరుపై చర్చించేందుకే గవర్నర్ ప్రధానితో భేటీ అయినట్లు రాజకీయవర్గాలు భావిస్తున్నాయి. ప్రధాని సూచనల మేరకే ఆయన నడుచుకునే అవకాశముందని ఆ వర్గాలు అంచనా వేస్తున్నాయి. వచ్చే నెల అసెంబ్లీలో గవర్నర్ తీరు ఎలా వున్నా, అది ప్రధాని సూచనల మేరకు జరిగినట్లుగానే భావించాల్సివుంటుందని ఆ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

పెరియార్‌కు ఘన నివాళి


తంథై పెరియార్ విగ్రహం వద్ద మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్


పెరియార్‌కు నటుడు విజయ్ నివాళి

ప్యారీస్, డిసెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): ద్రవిడ పితామహుడు తంథై పెరియార్ 51వ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం ఆయన విగ్రహాలకు, చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. వెప్పేరిలో ఉన్న పెరియార్ విగ్రహం, సిమ్సన్ జంక్షన్‌లో ఉన్న విగ్రహాలకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున ముఖ్యమంత్రి స్టాలిన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పెరియార్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన డిజిటల్ గ్రంథాలయాన్ని స్టాలిన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు దురై మురుగన్, పీకే.శేఖర్‌బాబు, ఎంపీలు కనిమొళి, ఎ.రాజా, మేయర్ ప్రియ, ఎమ్మెల్యేలు తాయగం కవి, జోసఫ్ స్వామి వేలు, ద్రాడిడర్ కళగమ్ వీరమణి తదితరులు పాల్గొని పెరియార్‌కు నివాళులర్పించారు. అలాగే తమిళనాడు కాంగ్రెస్ కమిటీ తరుపున ఎస్ఏ.వాసు, శివరాజశేఖరన్, జె.బిల్లి బాబు, డీపీఐ ప్రధాన కార్యదర్శి తిరుమావలవన్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జి.రామకృష్ణన్, ఏఎంఏంకే ప్రధాన కార్యదర్శి టీటీవి.దినకరన్, తమిళగ వెట్రీ కళగం అధ్యక్షుడు, సినీ నటుడు విజయ్ తదితర నేతలు పెరియార్‌కు నివాళులర్పించారు.

ఎంజీఆర్ మార్గంలో పయనిద్దాం.. డీఎంకేను ఇంటికి సాగనంపుదాం

● ఎడప్పాడి ప్రతిజ్ఞ ● ఘనంగా పురట్చి తలైవర్ 37వ వర్ధంతి


ఎంజీఆర్ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ఈపీఎస్

అడయార్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పురట్చి తలైవర్ డాక్టర్ ఎంజీఆర్ చూపిన మార్గంలో పయనిస్తూ, ప్రజా వ్యతిరేక పాలన చేస్తున్న డీఎంకేను ఇంటికి సాగనంపుదామని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి కె.పళనిస్వామి పిలుపునిచ్చారు. అన్నాడీఎంకే వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి దివంగత పురట్చి తలైవర్ డాక్టర్ ఎంజీఆర్ 37వ వర్ధంతి మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మెరీనాతీరంలోని ఎంజీఆర్ సమాధి వద్ద ఎడప్పాడి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేతలైన పార్టీ ప్రిసీడియం ఛైర్మన్ తమిళ్ మగన్ హుస్సేన్, కోశాధికారి దిండిగల్ శ్రీనివాసన్, మాజీ మంత్రులు పొన్నయ్యన్, డి.జయకుమార్, పా.వళర్మతి, పి.బెంజిమన్, ఎస్.అబ్దుల్ రహీం, తంగమణి, ఎస్పీ వేలుమణి, గోకుల ఇందిరా, అగ్రి కృష్ణమూర్తితో సహా అనేక మంది నేతలు, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులతో ఎడప్పాడి ప్రతిజ్ఞ చేయించారు. 'ఎంజీఆర్ చూపిన మార్గంలో పయనిద్దాం.. డీఎంకే పాలనకు చరమగీతం పాడుదాం' అని పిలుపునిచ్చారు.




ఎంజీఆర్ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ఓపీఎస్, శశికళ

కాగా అన్నాడీఎంకే బహిష్కృత నేతలైన మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్ సెల్వం, వీకే శశికళ, టీవీకే దినకరన్ తదితరులు కూడా వేర్వేరుగా వచ్చి ఎంజీఆర్‌కు నివాళులర్పించారు.

మరో రెండు నగరాల్లో మెట్రో

● కోవైలో రూ.10,740 కోట్లతో.. మదురైలో రూ.11,340 కోట్లతో నిర్మాణం
● ఫిబ్రవరి నుంచి భూసేకరణ


కోవై మెట్రోరైల్ రూట్ మ్యాప్ పరిశీలిస్తున్న సీఎంఆర్ఎల్ ఎండీ సిద్దిక్

పెరంబూర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని నగరంలో పరుగులు తీస్తున్న మెట్రోరైల్.. త్వరలో మరో రెండు నగరాల్లో కూడా మురిపించనుంది. కోయంబత్తూర్‌లో రూ.10,740 కోట్లు, మదురైలో రూ.11,340 కోట్లతో మెట్రోరైల్ ప్రాజెక్ట్ చేపట్టేందుకు రంగం సిద్ధమైంది. భూసేకరణ పనులు ఫిబ్రవరిలో ప్రారంభమవుతాయని చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) మేనేజింగ్ డైరెక్టర్ సిద్ధిక్ తెలిపారు. కోయంబత్తూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ... కోవై కార్పొరేషన్‌లో 32 స్టేషన్లతో రెండు మార్గాల్లో మెట్రోరైలు ప్రాజెక్ట్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించామన్నారు. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి ఇటీవల మరికొన్ని వివరాలను కేంద్ర ప్రభుత్వం అడిగిందని తెలిపారు. ఈ వివరాలు కూడా అందించామని, అనుమతుల కోసం ఎదురుచూస్తున్నామన్నారు. మెట్రో రైలు ప్రాజెక్ట్ ప్రారంభ పనులు జనవరి, ఫిబ్రవరిలో చేపట్టనున్నామన్నారు. కోవైలో మెట్రో డిపో ఏర్పాటుకు 16 ఎకరాలు, రైలు మార్గాలకు 10 హెక్టార్ల స్థలం అవసరమవుతుందని తెలిపారు. కోవైలో అవినాశి పై ఓవర్ ప్రకటన కూడా పరిగణలోకి తీసుకొని ప్రాజెక్ట్ సిద్ధం చేశామన్నారు. మదురై తిరుమంగళం నుంచి ఒత్తకడై వరకు 32 కి.మీ మెట్రో రైలు ప్రాజెక్ట్ ఏర్పాటుకానుందని సీఎంఆర్ఎల్ ఎండీ సిద్దిక్ తెలిపారు.

సమాచార దర్శిని

28 నుంచి చదురగిరికి అనుమతి

పెరంబూర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ జిల్లాలోని పశ్చిమ కనుమల్లో ఉన్న చదురగిరి సుందర మహాలింగం ఆలయానికి ప్రదోషం, అమావాస్య, పౌర్ణమి రోజుల్లో భక్తులను అనుమతిస్తుంటారు. ఆ ప్రకారం, ప్రదోషం, అమావాస్య సందర్భంగా ఈ నెల 28 నుంచి 31వ తేది వరకు భక్తులను అనుమతించనున్నారు. ఉదయం 6 నుండి మధ్యాహ్నం 12 గంటలకు వరకు మాత్రమే అనుమతించనున్నారు. ఒకవేళ ఆ రోజుల్లో వర్షాలు కురిస్తే భక్తులను అనుమతించమని జిల్లా యంత్రాంగం ప్రకటనలో తెలిపింది.

2 నుంచి పాఠశాలల పునఃప్రారంభం

పెరంబూర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పాఠ్య ప్రణాళికలో ప్రస్తుత విద్యా సంవత్సరం అర్ధవార్షిక పరీక్షలు ఈ నెల 16వ తేది ప్రారంభమై సోమవారంతో ముగిశాయి. దీంతో, పాఠశాలలకు జనవరి 1వ తేది వరకు క్రిస్మస్, న్యూ ఇయర్ సెలవులు ప్రకటించారు. జనవరి 2వ తేది నుండి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. కాగా, కొన్ని జిల్లాల్లో తుఫాను కారణంగా వాయిదాపడిన అర్ధవార్షిక పరీక్షలు జనవరి 2వ తేది నుంచి జరుగనున్నాయి.

నేడు తక్కువ సంఖ్యలో మెట్రోరైళ్లు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పండుగ సందర్భంగా బుధవారం సెలవు రోజుల టైం టేబుల్ ప్రకారం మెట్రో రైళ్లు నడువనున్నాయి. ఆ ప్రకారం, ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 12 గంటలు, రాత్రి 8 నుంచి 10 గంటల వరకు 10 నిమిషాలకు ఒక రైలు, రాత్రి 10 నుంచి 11 గంటల వరకు 15 నిమిషాలకు ఒక రైలు నడుపనున్నారు. ఇక, మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 8 గంటల వరకు 7 నిమిషాలకు ఒక రైలు నడుపనున్నట్లు సీఎంఆర్‌ఎల్ ప్రకటన విడుదల చేసింది.

'స్టార్టప్' సంస్థలకు రూ.15 లక్షల ఆర్థికసాయం

పెరంబూర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): 'స్టార్టప్' సంస్థలు ఏర్పాటుచేసే వారిని ప్రోత్సహించేలా రాష్ట్ర ప్రభుత్వం రూ.15 లక్షల వరకు ఆర్థికసాయం అందజేయనుంది. పర్యావరణ పరిరక్షణ, గ్రామీణ జీవనాధారం పెంపు తదితరాలు, మహిళలు ప్రారంభించే సంస్థలకు రూ.15 లక్షలు, ఇతర సంస్థలకు రూ.10 లక్షల వరకు ఆర్థికసాయం అందించనున్నారు. ఆసక్తి కలిగిన వారు www.startup.tn అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సచివాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

చెస్ పోటీలకు ఆహ్వానం

పెరంబూర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): 'ఛాలెంజర్స్ చెస్ అకాడమి' ఆధ్వర్యంలో చెంగల్పట్టు జిల్లాస్థాయి చెస్ పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన క్రీడాకారులు పేరు నమోదుచేసుకోవచ్చు. చెంగల్పట్టు సమీపం మామండూరులోని ప్రసన్న విద్యా మందిర్‌లో జనవరి 5వ తేది జరిగే పోటీల్లో 16 ఏళ్లలోపున్న వారు పాల్గొనవచ్చు. తొలి 15 స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేయనున్నారు. వివరాలకు https://Easypaychess.com, https://Chessentry.in వెబ్‌సైట్,9940567200, 9940058265 నెంబర్లలో సంప్రదించవచ్చని నిర్వాహకులు ప్రకటనలో తెలిపారు.

పాఠశాలలకు ఇంటర్నెట్ ఛార్జీలు విడుదల

పెరంబూర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ ఉన్నత, మహోన్నత పాఠశాలలకు నెలకు రూ.1,500 చొప్పున ఏప్రిల్ నుంచి జూలై వరకు ఇంటర్నెట్ ఛార్జీలుగా రూ.3.73 కోట్లు విడుదల చేశారు. అలాగే, 2,973 ఉన్నత పాఠశాలలకు నెలకు రూ.1,500 చొప్పున ఆగస్టు నెలకు రూ.44.59 లక్షలు, 3,074 మహోన్నత పాఠశాలలకు ఆగస్టు, సెప్టెంబరు నెలలకు రూ.99.22 లక్షలు విడుదల చేశారు. ఈ ఛార్జీలను ఆయా సంస్థలకు సత్వరం చెల్లించి, అందుకు సంబంధించిన రసీదులు 'ఎమిస్' వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సమగ్ర పాఠశాల విద్య పథక డైరెక్టరేట్ జిల్లా విద్యాశాఖాధికారులకు ఉత్తర్వులు జారీచేసింది.

నేడు 'తెలుగు వికాస సమితి' క్యాలెండర్ ఆవిష్కరణ

చెన్నై, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): 'తెలుగు వికాస సమితి' ఆధ్వర్యంలో తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండి తాలూకా పాదిరివేడులో బుధవారం మధ్యాహ్నం 2.15 గంటలకు తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ జరుగనుంది. సమితి అధ్యక్షులు పోజుల ముద్దుకృష్ణుడు అధ్యక్షతన జరుగనున్న ఈ కార్యక్రమానికి శాస్త్రవేత్త డాక్టర్ కిల్లంపల్లి శ్రీనివాసరావ్, జనని ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య, తమిళనాడు తెలుగు పీపుల్ సొసైటీ వ్యవస్థాపకులు దేవరకొండరాజు ముఖ్య అతిథులుగా, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ 87వ వార్డు కౌన్సిలర్ డాక్టర్ ఏపీ పూర్ణిమ ఆత్మీయ అతిథిగా హాజరుకానున్నారు. సమితి గౌరవ అధ్యక్షులు ఏవీ రామకృష్ణ నేతృత్వం వహించనున్న ఈ కార్యక్రమం గోను గజేంద్రబాబు ప్రార్థనాగీతంతో ప్రారంభంకానుండగా, శాంతా భాస్కర్ శిష్య బృందం, నాట్యాలయ క్లాసికల్ డ్యాన్స్ గ్రూప్‌చే సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించనున్నారు. గుమ్మిడిపూండికి చెందిన రాజు క్లినిక్ నిర్వాహకులు డాక్టర్ కొండూరు వెంకటసుబ్బరాజు క్యాలెండర్ ఆవిష్కరించనుండగా, నందిమండలం వెంకట రామరాజు, బొప్పన పద్మనాభంలను సత్కరించనున్నారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించనున్న ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నారు.

ఏనుగును తరిమేందుకు పడరానిపాట్లు

- ఊరంతా మిరప్పొడి వస్త్రాల తోరణాలు, స్ప్రే





ఏనుగు దాడిలో ధ్వంసమైన ఇంటిపైకప్పును చూపుతున్న మహిళ - ఊరి పొలిమేరలో ఎండిన ఏనుగు లద్దెను కాల్చటంతో వ్యాపిస్తున్న పొగలు - ఓ ఇంటి గడపకు, ఓ దుకాణం ముందు మిరప్పొడితో తడిపిన గుడ్డను కడుతున్న అటవీశాఖ సిబ్బంది

టి.నగర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బియ్యం రుచి మరిగిన మగ ఏనుగు నీలగిరి జిల్లా పందలూరు పరిసర ప్రాంతాల్లోని జనావాసప్రాంతాల్లోకి చొరబడి బియ్యాన్ని ఆరగిస్తూ స్థానికులకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. గిరిజనులు, తేయాకు కార్మికుల ఇళ్లను ధ్వంసం చేసి ఆ ఏనుగు బీభత్సం సృష్టిస్తోంది. ఆ అడవి ఏనుగును అడవిలోకి తరిమికొట్టి తమను కాపాడాలని స్థానికులు అటవీశాఖాధికారులకు ఎన్నోమార్లు విజ్ఞప్తి చేశారు. చివరకు అటవీ శాఖ సిబ్బంది రంగంలోకి దిగి ఆ ఏనుగును ఊరిలో అడుగుపెట్టకుండా ఉండేందుకు చర్యలు చేపట్టారు. గూడలూరు ఫారెస్ట్‌రేంజ్‌లో పనిచేస్తున్న సిబ్బంది 24 గంటలపాటు ఆ ఊరి నలుమూలల నిఘా వేశారు. ఏనుగును తరమటంలో అనుభవం కలిగిన ఫారెస్ట్ టాస్క్‌ఫోర్స్ సహా సుమారు 75 మంది ఏనుగు కదలికలపై నిఘా వేశారు. ముదుమలై నుండి రెండు కుంకీ ఏనుగులను కూడా తెప్పించి ఆ ఏనుగును తరిమికొట్టేందుకు ప్రయత్నించారు. ఇంత చేసినా ఆ అడవి ఏనుగు అటవీ శాఖ సిబ్బంది కళ్లుగప్పి రాత్రిపూట ఆ ఊరిలో ప్రవేశించి బీభత్సం సృష్టిస్తూనే ఉంది.

తరిమేందుకు కొత్త పద్ధతులు...

ఈ నేపథ్యంలో ఆ ఏనుగు ఊరిలోకి ప్రవేశించకుండా ఉండేందుకు అటవీ శాఖ అధికారులు కొత్త పద్ధతులను ఎంచుకున్నారు. మదం పట్టిన ఏనుగు లద్దెతో స్ప్రే చేయటం, పొగ వేయటం, మిరప్పొడితో తడిపిన గుడ్డలను గుమ్మాలకు వేలాడదీయటం ఇలా వింత పద్ధతులను అవలంబిస్తున్నారు. అడవి ఏనుగును తరిమేందుకు కొత్త యుక్తులను అమలు చేస్తుండటంపై అటవీశాఖ అధికారులు మాట్లాడుతూ ఆ ఏనుగు పగటిపూట అడవిలోనే కావాల్సినంత మేత మేసినా, బియ్యం రుచి మరిగి రాత్రిపూట ఊరిలోకి చొరబడి ఇళ్లలో భద్రపరచిన బియ్యం తింటోందన్నారు. ఆ ఏనుగును తరిమేందుకు డ్రోన్‌కెమెరాలు, కుంకీ ఏనుగులు, థెర్మల్ కెమెరాలతో ఏర్పాట్లు చేపట్టామని, చివరకు మదపుటేనుగు తిరిగే ప్రాంతంలో మరో ఏనుగు సంచరించదనే లాజిక్ ప్రకారం ముదుమలై ఏనుగుల సంరక్షణ కేంద్రం నుండి మదపుటేనుగు లద్దె తీసుకొచ్చి ఊరిలో అక్కడక్కడా స్ప్రే చేస్తున్నామని చెప్పారు. ఇదేవిధంగా ఏనుగు లద్దెను ఎండబెట్టి పగటిపూట ఊరి నలుమూలల పొగవేస్తున్నామన్నారు. వీటితోపాటు ఇళ్ల తలుపులు, కిటికీల వద్ద మిరప్పొడితో తడిపిన బట్టను తోరణాలుగా కడుతున్నామని చెప్పారు. మిరప్పొడి వాసనకు ఆ ఏనుగు ఇళ్లలోకి చొరబడదని భావిస్తున్నామని చెప్పారు. అటవీ శాఖ సిబ్బంది అమలు చేస్తున్న ఈ కొత్త ఉపాయాలు ఏ మేరకు పనిచేస్తాయో చూద్దామంటూ స్థానికులు ఎదురు చూస్తున్నారు.

కోర్టుల భద్రతకు 550 మంది పోలీసులు

పెరంబూర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తొలివిడతగా 275 కోర్టుల్లో కొత్తగా ఇద్దరు చొప్పున 550 సాయుధ పోలీసులను నియమించారు. రెండు రోజుల క్రితం తిరునల్వేలిలో కేసు విచారణకు హాజరైన మాయాండి అనే యువకుడు కోర్టు ప్రవేశద్వారం వద్ద దారుణహత్యకు గురయ్యాడు. ఈ ఘటనను సుమోటో కేసుగా విచారించిన మద్రాసు హైకోర్టు, జిల్లా కోర్టులకు సాయుధ దళ పోలీసు భద్రత కల్పించాలని ఉత్తర్వులు జారీచేసింది. ఆ ప్రకారం, తొలివిడతగా రాష్ట్రంలో 275 కోర్టుల వద్ద అదనపు భద్రత కల్పించారు. ఇప్పటికే ఉన్న పోలీసులతో పాటు, ఒక్కో కోర్టులో అదనంగా మరో ఇద్దరు నియమితులయ్యారు. వారికి తుపాకులు కూడా అందించారు. ఈ విషయమై పోలీసు శాఖ ఉన్నతాధికారులు మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కోర్టులకు అవసరాన్ని బట్టి భద్రత పెంచుతామని, కొత్తగా విధులు చేపట్టిన పోలీసులు తుపాకులతో విధులు చేపడతారని వారు తెలిపారు.

పాఠశాల విద్యార్థుల ఉన్నత విద్యకు రూ.6.23 కోట్లు

పెరంబూర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివి, ఉన్నత విద్యాసంస్థల్లో చేరే విద్యార్థుల ఫీజులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.6.23 కోట్లు కేటాయించింది. ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుంచి 12వ తరగతి వరకు చదువుకొని, దేశంలో ఉన్న ప్రముఖ విద్యాసంస్థల్లో ఉన్నత విద్యలో చేరే విద్యార్థుల ఫీజును రాష్ట్ర ప్రభుత్వం భరించనుంది. విదేశీ ఉన్నత విద్యాసంస్థల్లో ఉపకారవేతనాలు పొంది, ఆ విద్యాసంస్థల్లో చేరే విద్యార్థుల తొలి ప్రయాణ ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందని గత జూన్‌లో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం ప్రకటించింది. ఆ ప్రకారం, ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన, 2021-22 విద్యా సంవత్సరంలో 18 మంది, 2023-24 విద్యాసంవత్సరంలో 74, ప్రస్తుత విద్యా సంవత్సరం 333 మంది విద్యార్థులు పలు ఉన్నత విద్యాసంస్థల్లో చేరారు. వారి విద్యా ఫీజు నిమిత్తం రూ.6 కోట్ల 23 లక్షల 8,168 ప్రభుత్వం కేటాయించిందని అధికారులు తెలిపారు.

పాత పేపర్ల దుకాణాల్లో 9, 10వ తరగతి జవాబుపత్రాలు

పెరంబూర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మానామధురై సమీపం కల్‌కుర్చి ప్రభుత్వ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థుల అర్ధవార్షిక పరీక్షల జవాబుపత్రాలు తూకానికి విక్రయించినట్లు సమాచారం. దీంతో, ఉపాధ్యాయులు అక్కడి వెళ్లి వాటిని తీసుకొచ్చారు. శివగంగ జిల్లా మానామధురైలో సమీపం కల్‌కుచ్చిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 400 మందికిపైగా విద్యార్థులు చదువుతున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 6 నుంచి 8వ తరగతి వరకు ఈ నెల 9, 10వ తరగతికి 10వ తేది నుంచి ప్రారంభమైన అర్ధవార్షిక పరీక్షలు రెండు రోజుల క్రితం ముగిశాయి. 10వ తరగతి విద్యార్థులు రాసిన తమిళం, మ్యాథ్స్ సైన్స్ జవాబుపత్రాలు గత శనివారం, పాత పుస్తకాలు, పరికరాలతో కలిపి తూకం వేసి విక్రయించారు. జవాబు పత్రాల మూల్యాంకనం చేపట్టిన ఉపాధ్యాయులు, ఈ విషయం తెలుసుకొని దిగ్భ్రాంతి చెందారు. మదురైలో పాత పేపర్లు వాహనాల్లో పంపిస్తున్నారని తెలుసుకున్న ఉపాధ్యాయులు, జవాబు పత్రాలు తిరిగి పొంది పాఠశాలకు తీసుకొచ్చారు. ఈ విషయమై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆరోగ్యరాజ్ మాట్లాడుతూ... పాత పేపర్లతో పాటు ప్రస్తుతం జరిగిన పరీక్షకు సంబంధించిన జవాబు పత్రాలు కూడా తూకం వేసి విక్రయించారని, వాటిని తిరిగి పొందామన్నారు. 9వ తరగతి మ్యాథ్స్ 28 పేపర్లు, 10వ తరగతి మ్యాథ్స్ పేపర్లు 28 అని మొత్తం 56 జవాబుపత్రాలు తిరిగి పొందామని తెలిపారు.

విక్రయానికి రోజా మొక్కలు

పెరంబూర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం-ఉత్తరమేరూరు రోడ్డు సమీపం విచ్చంతాంగల్‌లో ప్రభుత్వ ఉద్యానవన ఫాం ఉంది. ఈ ఫాంలో పండ్లు, కూరగాయలు, పూలు, మూలికలు, సుగంధ ద్రవ్యాల మొక్కలు పెంచుతున్నారు. ప్రస్తుతం, ఫాంలో వివిధ రంగుల్లో రోజా పూల మొక్కలు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయి. 5 కిలోల పాలిథిన్ కవర్‌లో ఉంచి రోజా మొక్క రూ.65కు విక్రయిస్తున్నట్లు ఉద్యానవన శాఖ అధికారి దనుంజయన్ తెలిపారు.

పాఠశాలల్లో పాద పూజలొద్దు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు పాద పూజ పేరిట ఎలాంటి కార్యక్రమాలు చేపట్టరాదని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలకు పుదుకోట జిల్లా విద్యాధికారి సర్క్యులర్ పంపారు. కొంత కాలంగా పాఠశాలలకు తల్లిదండ్రులను రప్పించడం, వారికి పిల్లలతో పాద పూజ చేయడం వంటి ఘటనలు జరుగుతున్నాయి. వీటిని అడ్డుకోవాలని కోరుతూ పలువురు విద్యాశాఖకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ క్రమంలో, పాఠశాలల్లో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు పాద పూజలు చేసే కార్యక్రమాలు నిర్వహించరాదని ప్రైవేటు పాఠశాలలకు సర్క్యులర్ జారీ అయింది.

27 నుంచి రవాణా కార్మికులతో చర్చలు

అడయార్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రవాణా శాఖ కార్మికులతో 15వ వేతన ఒప్పందంపై ఈ నెల 27, 28వ తేదీల్లో రవాణా శాఖ ఉన్నతాధికారులు చర్చలు జరుపనున్నారు. రవాణా శాఖలో 1.08 లక్షల మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరికి ప్రతి మూడేళ్ళకు ఒకసారి వేతనాలు పెంపుతుంటారు. ఇందులో భాగంగా 13వ వేతన ఒప్పందం 2019 ఆగస్టు 24వ తేదీతో ముగిసింది. ఆ తర్వాత 14వ వేతన ఒప్పందాన్ని 2022 ఆగస్టు 24వ తేదీ అమలు చేశారు. ఇపుడు 15వ వేతన ఒప్పందాన్ని ఖరారు చేసేందుకు ప్రభుత్వం 14 మందితో కూడిన కమిటీని ఏర్పాటుచేసింది. ఈ నేపథ్యంలో గత నెల 27వ తేదీ ఈ కమిటీ క్రోంపేటలోని రవాణా శిక్షణా కేంద్రంలో ఎంటీసీ ఎండీ సారథ్యంలో తొలి దశ చర్చలు జరిగాయి. ఇందులో 85 సంఘాలకు చెందిన ప్రతినిధులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ నేపథ్యంలో రెండో దశ చర్చలను ఈ నెల 27, 28వ తేదీల్లో రెండు దశలపాటు నిర్వహించాలని నిర్ణయించారు. క్రోంపేటలోని రవాణా శాఖ కార్యాలయంలో జరిగే ఈ చర్చల్లో కమిటీ సభ్యులతో పాటు కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొని చర్చలు జరుపనున్నారు.

మార్చి నుంచి వేళచ్చేరి-సెయింట్ థామస్ మౌంట్ ఎమ్మార్టీఎస్ సేవలు ?

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేళచ్చేరి-సెయింట్ థామస్ మౌంట్ మధ్య 2025 మార్చి నుంచి ఎమ్మార్టీఎస్ రైలు సేవలు ప్రారంభం కానున్నట్లు సమాచారం. నగరంలో ట్రాఫిక్ రద్దీ నియంత్రించేలా చెన్నై బీచ్ నుంచి వేళచ్చేరి వరకు ఎమ్మార్టీఎస్ రైళ్ల ప్రాజెక్ట్ 1985లో ప్రాథమిక పనులు ప్రారంభించారు. 1997లో నుంచి ప్రారంభమైన మూడు విడతలుగా ఈ ప్రాజెక్ట్ పనులు పూర్తిచేసి 2007లో రైళ్లు అందుబాటులోకి వచ్చాయి. అనంతరం 2008లో రూ.495 కోట్లతో వేళచ్చేరి నుంచి సెయింట్ థామస్ మౌంట్ వరకు 5 కి.మీ మేర రైలు మార్గం పనులు ప్రారంభించారు. అందులో 4.5 కి.మీ మేర 167 పిల్లర్లపై రైలు మార్గం ఏర్పాటైంది. ఈ నేపథ్యంలో, ఆదంబాక్కం, తిల్లై గంగానగర్ ప్రాంతాల్లో చేపట్టిన భూసేకరణను కొందరు వ్యతిరేకిస్తూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో, ఆదంబాక్కం-సెయింట్ థామస్ మౌంట్ మధ్య 500 మీటర్ల వరకు రైలు మార్గం పనులు నిలిచిపోయాయి. దీంతో, 2007 నుంచి చెన్నై బీచ్-వేళచ్చేరి మధ్య మాత్రమే ఎమ్మార్టీఎస్ రైళ్లు నడుస్తున్నాయి. ఆదంబాక్కం, తిల్లై గంగా నగర్ ప్రాంతాల్లో భూసేకరణ న్యాయస్థానం తీర్పు ప్రకారం చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. అంతకు ముందుగా పుళిదివాక్కం, ఆదంబాక్కం తదితర రైల్వేస్టేషన్ల నిర్మాణాలు పూర్తిచేశారు. ఈ మార్గంలో సిగ్నలింగ్ కూడా సిద్ధం చేశారు. ప్రస్తుతం సమస్యలు పరిష్కారం కావడంతో ఆదంబాక్కం-సెయింట్ థామస్ మౌంట్ మధ్య రైలు మార్గం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ పనులు పూర్తయి 2025 మార్చిలో వేళచ్చేరి-సెయింట్ థామస్ మౌంట్ మధ్య ఎమ్మార్టీఎస్ రైళ్ల సేవలు ప్రారంభమయ్యే అవకాశముందని అధికారులు చెబుతున్నారు.

వైభవంగా గురుపూజా మహోత్సవం



గురుపూజలో పాల్గొన్న నిర్వాహకులు, భక్తులు

ప్యారీస్, డిసెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): కాలజ్ఞాని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి మనవరాలు ఈశ్వరీ మహాదేవి 235వ ఆరాధన గురుపూజోత్సవం వైభవంగా జరిగింది. మార్గశిర మాసం బహుళ నవమి రోజున ఈశ్వరీ దేవి జీవ సమాధి అయిన సందర్భంగా మంగళవారం కొరట్టూరు వాటర్ బేసిన్ కెనాల్ రోడ్డులో ఉన్న వీర బ్రహ్మేంద్ర స్వామి ఆశ్రమంలో ఉదయం 7.30 గంటలకు గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామికి అభిషేకం, 8.30 గంటలకు మహాగణపతి, మహాదుర్గ పూజలు, నవగ్రహ హోమాలను నిర్వహించారు. 10 గంటలకు ఈశ్వరీ మహాదేవి స్తుతి, లలితా సహస్ర నామం, కనకధారా స్తోత్ర పారాయణం, కుంకుమ పూజలను నిర్వహించారు. మధ్యాహ్నం స్వామి వార్లకు మహాదీపారాధన, ముత్తైదువులకు పసుపుకుంకుమ, భక్తులకు అన్నప్రసాదాలు వినియోగం చేశారు. వీరబ్రహ్మేంద్ర స్వామి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు తాతోలు వీరభద్రరావు, కార్యదర్శి ఏఎస్.బలరామమూర్తి, కోశాధికారి నూతక్కి కిషోర్, ట్రస్టీలు కే.సీతారామ శర్మ, బీఎస్.రావు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కన్నెమర లైబ్రరీలో తిరువళ్లువర్ ఫొటో ఎగ్జిబిషన్

ఐసిఎఫ్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి జిల్లా సముద్రతీర ప్రాంతంలో 2000వ సంవత్సరం జనవరి 1వ తేది అప్పటి ముఖ్యమంత్రి కరుణానిధి వివేకానంద, తిరువళ్లువర్ శిలా విగ్రహాలు ప్రారంభించారు. తిరువళ్లువర్ విగ్రహం ప్రతిష్టించి 25 సంవత్సరాలు పూర్తికావడంతో, తిరువళ్లువర్ విగ్రహ సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించాలని ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. ఈ క్రమంలో, సోమవారం ఉదయం లైబ్రరీ డైరెక్టర్ ఆర్.శంకర్ కన్నెమర లైబ్రరీలో తిరువళ్లువర్ చిత్రపటం ముందు జ్యోతి వెలిగించి ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సతీష్‌కుమార్, లైబ్రరీ అధికారులు గణేశ్, చంద్రకుమార్ పాల్గొన్నారు. ఈ రజతోత్సవ వేడుకల్లో భాగంగా విద్యార్థులకు క్విజ్, స్థానికులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు.ఈ నెల 26,29,30 తేదీల్లో తిరువళ్లువర్ రాసిన సూక్తులు, ఆయన జీవిత చరిత్రపై సెమినార్, పోటీలు నిర్వహించి, మొదటి బహుమతి రూ.5,000, రెండవ బహుమతి రూ.3,000, మూడవ బహుమతి రూ.2,000 అందించనున్నట్లు అధికారులు తెలిపారు.

అమిత్‌షా వ్యాఖ్యలు ఖండిస్తూ కాంగ్రెస్ ధర్నా



ధర్నాలో నేతలు, కార్యకర్తలు

వేలూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటులో అంబేడ్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు నిరసిస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయం సమీపంలో మంగళవారం జరిగిన ధర్నాకు జిల్లా అధ్యక్షుడు టీకారామన్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో పార్టీ నిర్వాహకులు ప్రశాంత్, వెంకటరామన్, రాధాకృష్ణన్, మనోహరన్ సహా 50 మందికి పైగా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంజీఆర్‌కు ఘననివాళి



ఎంజీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నేతలు, కార్యకర్తలు

వేలూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గుడియాత్తంలో పుదియ నీతి పార్టీ తరపున దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎంజీఆర్ 37వ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో నగర సెక్రటరీ రమేష్, కోశాధికారి వెంకటేశన్, వర్తక శాఖ అధ్యక్షుడు కన్నియప్పన్, ఎస్ఎస్ పేరవై నగర సెక్రటరీ శశికుమార్, యూనియన్ అధ్యక్షుడు కుమరవేల్ తదితరులు పాల్గొని, ఎంజీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అలాగే, జిల్లా సెక్రటరీ సెంథిల్, మండల సెక్రటరీ శరవణన్, యూనియన్ సెక్రటరీ రామ ఇళంగోవన్ తదితరులు అన్నదానం ప్రారంభించారు.

దోపిడీ కేసులో డాక్టర్, లా స్టూడెంట్ అరెస్టు

చెన్నై, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక షావుకారుపేట మింట్ వీధిలో బైకుపై వెళ్తున్న యువకుడి వద్ద దారిదోపిడీకి ప్రయత్నించిన ఫిజియోథెరపిస్ట్ ఇదయకన్నన్, లా విద్యార్థి నరేష్ సహా నలుగురిని మంగళవారం ఉదయం పోలీసులు అరెస్టు చేశారు. ఈ నెల 18న జరిగిన ఈ దారిదోపిడీ కేసులో ఆ ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరాలో నమోదైన దృశ్యాల ఆధారంగా వీరిని అరెస్టు చేశారు. ఈ నలుగురిని అరెస్టు చేసేందుకు ప్రయత్నించినప్పుడు ఇదయకన్నన్, నరేష్ పారిపోతూ కిందపడి తీవ్రంగా గాయపడ్డారని, వారిని ఆసుపత్రికి తీసుకెళ్ళి చికిత్సలందించినట్లు పోలీసులు తెలిపారు.

ఏనుగు దాడిలో మహిళ మృతి

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏనుగు దాడిలో మహిళ మృతిచెందిన ఘటన నీలగిరి జిల్లాలో చోటుచేసుకుంది. కోతగిరి తాలూకా కీల్‌కోతగిరి సమీపం కీల్ కట్టపట్టు గ్రామానికి చెందిన బాలన్ భార్య లక్ష్మి (56 గత ఆదివారం తెంగుమహాడా ప్రాంతంలోని తన బంధువుల ఇంటికి బస్సులో వెళ్లింది. బస్సు దిగిన లక్ష్మి,అక్కడి నుంచి రైతులఫాం మీదుగా నడిచి వెళుతోంది. ఆ సమయంలో పొదల మధ్య నుంచి వచ్చిన ఏనుగు లక్ష్మిని తొండం చుట్టి విసిరేసింది. తీవ్రంగా గాయపడిన లక్ష్మి అక్కడికక్కడే మృతిచెందింది. దీనిపై అటవీ శాఖ అధికారులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

కారు ప్రమాదంలో బిర్యానీ మాస్టర్ మృతి

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కారు ప్రమాదంలో బిర్యానీ మాస్టర్ మృతిచెందిన ఘటన విల్లుపురం ప్రాంతంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... రామాపురానికి చెందిన అబ్దుల్ కరీం (65) బిర్యానీ మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో, రామనాథపురంలోని ఓ కార్యక్రమానికి బిర్యానీ ఆర్డరు రాగా, అబ్దుల్ కరీం ఇటీవల కొనుగోలు చేసిన తన కొత్త కారులో కుమారుడు అహ్మద్ భాషా (30), మరో నలుగురితో ఆదివారం రాత్రి బయల్దేరాడు. సోమవారం తెల్లవారుజామున విల్లుపురం ప్రాంతం వద్ద కారు అదుపుతప్పి రోడ్డు పక్కన వేప చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో కారు నడుపుతున్న అబ్దుల్ కరీం అక్కడికక్కడే మృతిచెందాడు. కారులో ప్రయాణిస్తున్న కుమారుడు, రాయపేటకు చెందిన అబ్దుల్ భాషా (29), వాషర్‌మెన్‌పేటకు చెందిన కుమార్(31),సాక్ష్య(35), రఫిక్(34) ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు క్షతగాత్రులను ప్రభుత్వాసుపత్రికి తరలించి, కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేపట్టారు.

అన్నామలై కొండపై డ్రోన్

- ఇద్దరికి జరిమానా

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అన్నామలై కొండపై నిబంధనలు అతిక్రమించి డ్రోన్ ఎగుర వేసేందుకు యత్నించిన యత్నించిన ఇద్దరికి అధికారులు జరిమానా విధించారు. తిరువణ్ణామలై అరుణాచలేశ్వర ఆలయ కార్తీక దీపోత్సవాల్లో భాగంగా ఆలయం వెనుక వైపున్న 2,668 అడుగుల ఎత్తున్న కొండపై ఈ నెల 13వ తేది మహా దీపం వెలిగించారు. అదే సమయంలో ఫెంగల్ తుఫాను కారణంగా అన్నామలై కొండ నుంచి మట్టి చెరియలు విరిగిపడి ఏడుగురు మృత్యువాతపడిన సంగతి తెలిసిందే. మహాదీపం వెలిగించిన కొండకు భక్తులు వెళ్లడంపై నిషేధం విధించారు.ఈ క్రమంలో, కొందరు అక్రమంగా కొండపైకి వెళ్తున్నట్లు ఫిర్యాదులందాయి. అలా, కడలూరు జిల్లాచిదంబరంకుచెందిన రంజిత్, శరవణకుమార్ సోమవారం సాయంత్రం అన్నామలైకొండఎక్కి, అక్కడినుంచి డ్రోన్‌ఎగురవేసేందుకు యత్నించారు. వీరిని గమనించిన అటవీ సిబ్బంది, వారిని కొండ నుంచి దింపి, డ్రోన్ స్వాధీనం చేసుకొని, రూ.10వేల జరిమానా విధించి హెచ్చరించి పంపారు.

25 టన్నుల బియ్యం లారీ మాయం

ప్యారీస్, డిసెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి నుంచి బియ్యం లోడుతో కన్నియాకుమారికి బయలుదేరిన లారీ మాయమైంది. ఈ నెల 16వ తేదీ తిరునల్వేలి నుండి కన్నియాకుమారి జిల్లా రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలోని పౌరసరఫరాల గోదాముకు బయలుదేరిన లారీ వారంరోజులైనా గమ్యానికి చేరుకోలేదు. దాంతో అనుమానం వచ్చిన సివిల్ సప్లైస్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా పలు విషయాలు వెలుగు చూశాయి. కన్నియాకుమారి జిల్లాలోని నిధిరైవిలై గ్రామానికి చెందిన సురేష్ అనే వ్యక్తి ఈ లారీ డ్రైవర్‌గా వ్యవహరించాడని, ఆ లారీ చివరిసారిగా కన్నియాకుమారి జిల్లా మార్తాండం ప్రాంతం వైపు వెళ్లినట్లు సీసీ ఫుటేజ్ ద్వారా పోలీసులు గుర్తించారు. ఇదిలా ఉండగా బియ్యం లోడు లారీని ఎవరైనా దుండగులు స్వాధీనం చేసుకుని కేరళకు తరలించి ఉంటారేమోనని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. త్వరలో లారీని, దీనికి కారణమైన వారిని పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

కానిస్టేబుల్ బైక్ చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

ఐసిఎఫ్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పోలీసు వాహనం చోరీ కేసులో ఇద్దరు కటకటాలపాలయ్యారు. టి.నగర్ పాండి బజార్ సతీష్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో, ఈ నెల 20వ తేది రాత్రి తన ద్విచక్రవాహనాన్ని పోలీస్‌స్టేషన్ ముందు పార్కింగ్ చేసి పోలీస్ వాహనంలో గస్తీకి వెళ్లి తిరిగి ఉదయం 7 గంటల ప్రాంతంలో స్టేషన్‌కు చేరుకొని, తన వాహనం పార్కింగ్ చేసిన స్థలంలో లేకపోవడంతో చుట్టుపక్కల వెతికినా కనిపించలేదు. దీనిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు విచారణ చేపట్టి, థామస్ రోడ్డుకు చెందిన సతీష్, మనపాక్కంకు చెందిన రామ్‌కుమార్ వాహనాన్ని అపహరించినట్లు తేలింది. వీరిని అరెస్ట్ చేశారు.

బస్సు నుంచి జారిపడి వృద్ధురాలి మృతి

ఐసిఎఫ్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బస్సు నుంచి జారిపడి వృద్ధురాలు మృతిచెందిన ఘటన ఆవడిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... ఆవడి కోవిల్ పాదై ప్రాంతానికి చెందిన గిరిజ (64) అరక్కోణంలో ఉంటున్న తన కుమారుడి ఇంటికి వెళ్లేందుకు సోమవారం ఉదయం ఆవడిలో ఎంటీసీ బస్సు (నెం.77ఈ) ఎక్కింది. ఈ క్రమంలో, బస్సు ఆవడి అజయ్ స్టేడియం వద్దకు రాగా రోడ్డు మధ్యలో ఉన్న గుంతలో బస్సు దిగగా, బస్సు హఠాత్తుగా కుదుపేసింది. ఈ కుదుపుకు బస్సులో ఉన్న గిరిజ జారి కిందపడడంతో తలకు తీవ్ర గాయాలతో ఘటనా స్థలంలోనే మృతిచెందింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేపట్టారు.

దుకాణాలకు తమిళంలో పేర్లుండాలని ర్యాలీ



ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్ సుబ్బలక్ష్మి

వేలూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తమిళ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వ్యాపార సంస్థలు, పరిశ్రమలు, దుకాణాల నేమ్ బోర్డులో తమిళంలో పేర్లు ఉంచాలని కోరుతూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక టౌన్ హాలు వద్ద ర్యాలీని జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కార్తికేయన్, మేయర్ సుజాత, తమిళ అభివృద్ధి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జయజ్యోతి, పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. అన్నాసాలై నుంచి ప్రారంభమైన ర్యాలీ ఊరీసు కళాశాల వద్ద ముగిసింది.

ఆగని లంక నావికాదళ దాడులు

- 17 మంది రామేశ్వరం జాలర్ల నిర్బంధం
- విడుదల కోసం కేంద్రమంత్రికి స్టాలిన్ లేఖ

చెన్నై, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ధనుష్కోడి - తలైమన్నార్ మధ్య రెండు పడవల్లో వెళ్లి చేపలు పడుతున్న 17 మంది రామేశ్వరం జాలర్లపై మంగళవారం వేకువజాము శ్రీలంక నావికాదళం దాడి చేసి నిర్బంధించింది. దీనిపై తీవ్రంగా స్పందించిన ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అరెస్టయిన జాలర్లను వెంటనే విడుదలచేసేలా తక్షణ చర్యలు చేపట్టాలని కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి డాక్టర్ జయశంకర్‌కు లేఖ రాశారు. సోమవారం వేకువజాము రామేశ్వరం నుంచి జాలర్లు సముద్రంలో చేపలవేటకు బయలుదేరారు. మరపడవల్లో 17 మంది జాలర్లు తలైమన్నార్ ప్రాంతంలో మంగళవారం వేకువజాము చేపలు పడుతుండగా గస్తీ నౌకలో వచ్చిన శ్రీలంక నావికాదళం తమ దేశ సరిహద్దుల్లోకి చొరబడ్డారంటూ జాలర్లను అరెస్టు చేశారని రామేశ్వరం జాలర్ల సంఘం నాయకులు పేర్కొన్నారు. వీరందరినీ శ్రీలంకలోని తలైమన్నార్ ప్రాంతానికి తరలించుకెళ్ళారని తెలిపారు.

ప్రభుత్వాసుపత్రి నిర్మాణాల పరిశీలన

తిరుత్తణి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణిలో చేపట్టిన జిల్లా ప్రభుత్వాసుపత్రి నిర్మాణాలను మంగళవారం ఎంపీ జగద్రక్షన్, ఎమ్మెల్యే చంద్రన్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు నిర్ణీతకాలంలో పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యుడు తిరుత్తణి ఎం.భూపతి, రాష్ట్ర చేనేత కార్మికుల సంఘం ఉపాధ్యక్షుడు ఓప నాగలింగం, నగర కార్పొరేషన్ కార్యదర్శి వి.వినోద్‌కుమార్, నియోజకవర్గ పరిశీలకుడు షణ్ముగనాథన్, ప్రభుత్వ అధికారులు, వైద్యులు, స్థానిక ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

హెరాయిన్ సహా యువకుడి అరెస్ట్

ప్యారీస్, డిసెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక చింతాద్రిపేటలో హెరాయిన్ విక్రయిస్తున్న అసోం యువకుడిని అరెస్ట్ చేశారు. చింతాద్రిపేటలోని టైల్స్ దుకాణంలో పనిచేస్తూ హెరాయిన్‌ను విక్రయించిన అసోంకు చెందిన ఇస్లామ్(29)ని మంగళవారం మాదక ద్రవ్యాల నిరోదక విభాగం పోలీసులు అరెస్టు చేశారు. అతని నుంచి 10గ్రాముల హెరాయిన్ స్వాధీనం చేసుకుని కోర్టుకు తరలించారు.

మహాబలిపురంలో 'ఇండియన్ డాన్స్ ఫెస్టివల్' ప్రారంభం



నాట్య ప్రదర్శనలో కళాకారులు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా మహాబలిపురంలో ఇండియన్ డాన్స్ ఫెస్టివల్‌ను పర్యాటక శాఖ మంత్రి రాజేంద్రన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... 2007-08 నుంచి ఈ నృత్య ప్రదర్శనలు నెల రోజులు నిర్వహిస్తుండగా, 2009 నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసిన నేపథ్యంలో, గత ఏడాది 28.71 కోట్ల మంది పర్యాటకులు రాష్ట్రాన్ని సందర్శించారని తెలిపారు. నెల రోజులు జరుగనున్న ఈ వేడుకల్లో భరతనాట్యం, కూచిపూడి, కథాకళి సహా పలు సంప్రదాయ నృత్యాలు, పలు రాష్ట్రాల జానపద, గ్రామీణ కళా ప్రదర్శనలు ఉంటాయని మంత్రి తెలిపారు.

జల్లికట్టు పోటీలకు మార్గదర్శకాలు



వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జల్లికట్టు పోటీల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం మార్గదర్శకాలను విడుదల చేసింది. రాష్ట్రంలో జనవరి 14వ తేది పొంగల్ వేడుకల్లో భాగంగా జల్లికట్టు పోటీలు నిర్వహిస్తుంటారు. మదురై అవనియాపురం, పాలమేడు, అలంగానల్లూర్ తదితర ప్రాంతాల్లో జరిగే జల్లికట్టు పోటీలు చూసేందుకు దేశ, విదేశాల నుంచి ప్రజలు తరలివస్తుంటారు. ఈ నేపథ్యంలో, పశుసంవర్ధక శాఖ ప్రధాన కార్యదర్శి సత్యప్రదసాహూ జిల్లా కలెక్టర్లకు పంపిన లేఖలో, జల్లికట్టు మార్గదర్శకాలను సూచించారు.

- జిల్లా కలెక్టర్ నుంచి ప్రాంతం, సమయం తీసుకోకుండా జల్లికట్టు పోటీలు నిర్వహించరాదు.
- జల్లికట్టు పోటీల నిర్వహణకు తగిన భద్రత కల్పించాలి.
- జల్లికట్టు పోటీల్లో పాల్గొనే ఎద్దులను హింసించరాదు.
- జల్లికట్టు పోటీలకు ముందు ఎద్దులకు పశు వైద్యుల సర్టిఫికెట్ పొందాలి.
- కొత్తగా రూపొందించిన www.jallikattu.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో మాత్రమే జల్లికట్టు పోటీలకు దరఖాస్తు చేసుకోవాలి.
- జల్లికట్టు పోటీలను పూర్తిగా వీడియో రికార్డింగ్ చేయాలి.

సాత్తనూరు నుంచి తప్పించుకున్న మొసళ్లు



పెరంబూర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సాత్తనూర్ డ్యాం, మొసళ్ల ఫాం నుంచి 150కి పైగా మొసళ్లు తప్పించుకున్నాయని దిగ్భ్రాంతికర వార్తలు వస్తున్నాయి. తిరువణ్ణామలై జిల్లా సాత్తనూరు డ్యాం సమీపంలో, ఆసియాలోనే రెండవ అతిపెద్ద మొసలి ఫాం ఉంది. డ్యాం, ఫాంలలో అధిక సంఖ్యలో మొసళ్లు జీవిస్తున్నాయి. వేసవిలో మొసళ్లు నీటి నుంచి బయటకు వచ్చి తీరప్రాంతాల్లో సేదదీరుతుంటాయి. ఈ నెల 2న భారీవర్షాల కారణంగా తెన్‌పెన్నై నదిలో వరద ఉధృతి పెరిగింది. దీంతో, తెన్‌పెన్నై నది నుంచి సుమారు 2 లక్షల ఘనపుటడుగుల అదనపు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. ఈ వరద ఉధృతికి సాతనూరు డ్యాం, సమీపంలోని ఫాం నుంచి 150కి పైగా మొసళ్లు కొట్టుకుపోయినట్లు సమాచారం. ఈ మొసళ్లు సమీపంలోని చెరువులు, గుంటల్లో చేరగా, మరికొన్ని ముఖద్వారం మీదుగా సముద్రంలోకి వెళ్లాయని సమాచారం. ప్రస్తుతం చెరువులు, గుంటల్లో చేరిన మొసళ్లు బయటకు వస్తున్నాయి. కడలూరులో మాత్రమే రెండు మొసళ్లను అటవీశాఖ అధికారులు బంధించారు. చెరువు, గుంటల వద్దకు తాగునీటి కోసం వచ్చే పశువులు, స్నానాలు చేద్దామని వచ్చే వారికి ఈ మొసళ్ల వలన పెను ప్రమాదం ఉందని, ఈ విషయమై ఆయా ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసేలా అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని సమాజ శ్రేయోభిలాషులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కోలాహలంగా 'క్రిస్మస్ యూత్ ఫెస్ట్'




విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

ఐసిఎఫ్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక పులియాన్‌తోపు కన్నికాపురం ప్రాంతంలోని కస్తూర్బా తెలుగు బాప్టిస్టు చర్చిలో 'క్రిస్మస్ యూత్ ఫెస్ట్' శనివారం రాత్రి కోలాహలంగా సాగాయి. ఈ కార్యక్రమంలో దైవజనులు రెవ.యెస్సయ్య, రెవ.వి.యేసుదాసు దైవ సందేశం బోధించారు. ఈ సందర్భంగా చర్చి నిర్వాహకులు సండే స్కూలు పిల్లలకు, యువతీ యువకులకు పాటలు, డ్రామా పోటీలు నిర్వహించగా, ప్రథమ బహుమతి నరసింహనగర్ కెనాల్ తెలుగు బాప్టిస్టు సంఘ పిల్లలు, యువతీ యువకులకు లభించింది. ఈ కార్యక్రమంలో చర్చి ప్రెసిడెంట్ జీఎస్ యేసుదాసు, సెక్రటరీ ఐఎల్ యేసుదాను, ట్రెజరర్ సి.యేసు తదితరులు పాల్గొన్నారు.

31న తిరువళ్లువర్ విగ్రహ సిల్వర్ జూబ్లీ వేడుకలు

- కన్నియాకుమారికి ప్రత్యేక బస్సులు
- ప్రారంభించిన ఉపముఖ్యమంత్రి



ప్యారీస్, డిసెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రసిద్ధి చెందిన కన్నియాకుమారిలో తిరువళ్లువర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి 25ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ నెల 31, జనవరి 1వ తేదీల్లో పర్యాటక శాఖా ఆధ్వర్యంలో సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించనున్నారు. ఈ వేడుకలపై ప్రజల్లో అవగాహన కల్పించేలా పది బస్సులకు తిరువళ్లువర్ పెయింటింగ్ చేశారు. ఈ బస్సులను మంగళవారం నగరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉపముఖ్యమంత్రి ఉదయనిధి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎంపీ. స్వామినాథన్, పీకే.శేఖర్‌బాబు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

వన్నియార్లకు రిజర్వేషన్లు కల్పిస్తే
డీఎంకేకు బేషరతు మద్దతు

- పోటీ చేయం, కూటమిలో చేరుతాం
- మహాధర్నాలో పీఎంకే నేత అన్బుమణి



మహాధర్నాలో పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి

చెన్నై, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ప్రభుత్వం వన్నియార్లకు 15 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే ఎలాంటి షరతులు లేకుండా ఆ పార్టీకి మద్దతు ఇస్తామని, ఆ ఫైలుపై స్టాలిన్ సంతకం చేస్తే చాలు, సీట్లు అడగమని, అలాగే పోటీ కూడా చేయమని, ఆ పార్టీ కూటమిలోనే చేరతామని పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి ప్రకటించారు. వన్నియార్లకు 15 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ మంగళవారం పీఎంకే ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, రాస్తారోకోలు జరిగాయి. కాంచీపురంలో జరిగిన ధర్నాకు అన్బుమణి నాయకత్వం వహించి ప్రసంగించారు. రాష్ట్రంలో వన్నియార్లకు అంతర్గత రిజర్వేషన్లు కల్పించేందుకు ఎలాంటి అభ్యంతరాలు లేవని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చి 1000 రోజులవుతోందని, డీఎంకే పాలకులు ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టకుండా వన్నియార్లకు తీరని ద్రోహం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని వన్నియార్లు ఆర్థికంగా చాలా వెనుకబడి ఉన్నారని, వారికి రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరం ఉందని చెప్పారు. పాలనా వ్యవహారాల్లోనూ 53 మంది ఐఏఎస్ అధికారులు ప్రభుత్వ కీలక శాఖలలో పనిచేస్తున్నా, వారిలో వన్నియార్లు లేరని ఆయన చెప్పారు.

ఆ పదవికి దురైమురుగన్ అనర్హుడా?: రాందాస్

డాక్టర్ రాందాస్ నేతృత్వంలో విల్లుపురంలో జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మంత్రివర్గంలో సీనియర్, పాలనానుభవం ఉన్న దురైమురుగన్‌కు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వకపోవడం గర్హనీయమన్నారు. డీఎంకేని పెంచిపోషించింది తొలి నుండీ వన్నియార్లేనని, మొదటిసారి డీఎంకే తరఫున పోటీ చేసి గెలిచిన 15 మంది ఎమ్మెల్యేల్లో 14 మంది వన్నియార్లేనని గుర్తు చేశారు. ప్రస్తుతం డీఎంకేలో సీనియర్ నాయకుడైన దురైమురుగన్ వాస్తవానికి ముఖ్యమంత్రి పదవి చేపట్టి ఉండాల్సిందని, వన్నియార్ కావడం వల్లే ఆయనకు కీలక పదవులు ఇవ్వలేదని ఆరోపించారు.

ఉత్సాహంగా
వెయ్యిమంది శాంటాక్లాజ్‌ల ర్యాలీ



శాంటాక్లాజ్ ర్యాలీలో రాష్ట్ర మంత్రి నాజర్, బిషప్ మోహన్‌దాస్



ప్యారీస్, డిసెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పండుగను ఆహ్వానిస్తు నగరంలో వెయ్యి మంది శాంతాక్లాజులతో నిర్వహించిన ర్యాలీ ఉత్సాహంగా సాగింది. వ్యాసర్పాడి నుంచి మింట్ గడియార స్తంభం వరకు నిర్వహించిన ప్రదర్శనలో శాంటాక్లాజ్‌ల వేషధారణలో చిన్నారుల నుంచి పెద్దల వరకు సందడి చేశారు. ఆలిండియా క్రిస్టియన్ చర్చ్ కౌన్సిల్ బిషప్ మోహన్‌దాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న రాష్ట్ర మంత్రి ఎస్‌ఎం.నాజర్ ర్యాలీని ప్రారంభించారు.

ట్రూత్ ఫౌండేషన్‌లో..

రెడ్‌హిల్స్ సమీపంలోని విలాంగాడుపాక్కం మల్లిమానగర్‌లో ట్రూత్ ఫౌండేషన్ నిర్వహణలోని అనాథ సంక్షేమ హాస్టల్‌లో క్రిస్మస్ సందడి నెలకొంది. ఫౌండేషన్ డైరెక్టర్ రెవ. దయాపాత్ర, కోడైరెక్టర్ శారా సహా పలువురు పాస్టర్లు పాల్గొన్నారు.

ఐసీఎంసీ చర్చిలో..

ఇండియా క్రిస్టియన్ మినిస్ట్రీస్ కౌన్సిల్ (ఐసీఎంసీ) ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను నగరంలో ఘనంగా జరుపుకొని సంక్షేమ సహాయాలను పంపిణీ చేశారు. హిందూ దేవాదాయ శాఖా మంత్రి పీకే.శేఖర్ బాబు, గ్రేటర్ చెన్నై మేయర్ ప్రియా రాజన్, ఐసీఎంసీ కోర్డినేటర్ డాక్టర్ దయాపాత్ర, కౌన్సిల్ సభ్యులు, బిషప్‌లు, ఫాదర్ పాల్గొన్నారు.





ఐసీఎంసీ క్రిస్మస్ వేడుకల్లో మంత్రి పీకే.శేఖర్‌బాబు, మేయర్ ప్రియా రాజన్ తదితరులు - ట్రూత్ ఫౌండేషన్ హాస్టల్ విద్యార్థులతో దయాపాత్ర - శారా దంపతులు

- ఎంజీఆర్ వర్థంతి వేడుకలు

డాక్టర్ సునీల్ ఆధ్వర్యంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న డాక్టర్ సునీల్

అడయార్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ పురట్చి తలైవర్ ఎంజీ రామచంద్రన్ 37వ వర్ధంతిని పురస్కరించుకుని అన్నాడీఎంకే అనుబంధ విభాగమైన ఎంజీఆర్ యువజన విభాగ సంయుక్త కార్యదర్శి డాక్టర్ సునీల్ ఆధ్వర్యంలో మంగళవారం అన్నదానం జరిగింది. టి.నగర్ 141 వార్డు పరిధిలో ఉన్న సీఐటీ నగర్ మార్కెట్ కూడలి ప్రాంతంలో వెయ్యిమందికి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని 141వ వార్డు విభాగం కార్యదర్శి ఆర్‌సీఏ ప్రభాకరన్ ఏర్పాటు చేయగా, ఇందులో మాజీ కౌన్సిలర్ ఆర్‌సీ ఆర్ముగం, పార్టీ నేతలు రేణుక షణ్ముగం, కె.పళని, కె.శాంతి, పి.మంజుల, ఎస్.బాలకృష్ణన్, కె.అరుళ్‌దాస్, ఏ.విశ్వనాథన్, పి.కన్నన్, ఎంఏ ముస్తఫా, పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

క్రిస్మస్ సందడి... చర్చిల్లో ప్రార్థనలు



బాలర్‌మెట్రిక్యూషన్ పాఠశాలలో క్రిస్మస్ సంబరాల్లో విద్యార్థుల సందడి దృశ్యాలు





వెపేరిలో విద్యుత్ వెలుగుల్లో తెలుగు బాప్టిస్ట్ చర్చీ

క్రిస్మస్ పండుగను బుధవారం జరుపుకోనున్న సందర్భంగా గ్రేటర్ చెన్నైలోని చర్చిలు, క్రైస్తవులు అధికంగా నివసిస్తున్న ప్రాంతాల్లో సోమవారం నుంచే సందడి మొదలైంది. పశువులపాకలో జన్మించిన యేసుక్రీస్తును గుర్తు చేసుకుంటూ చర్చి ప్రాంగణాలను స్టార్లు, పశువుల పాక, బెల్స్, క్రిస్మస్ ట్రీ, విద్యుత్ దీపాలు, వివిధ అలంకరణ సామగ్రితో అలంకరించారు. ఇక పండుగ సందర్భంగా బంధువులు, స్నేహితులకు బహుమతులు, కేకులు కానుకగా ఇచ్చేందుకు షాపింగ్ మాల్స్, సంత వీధుల్లో సోమవారం కొనుగోళ్లు జోరుగాసాగాయి.

- ప్యారీస్, ఆంధ్రజ్యోతి



టి.నగర్‌లోని కమలాలయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలైని కలుసుకుని విజయకాంత్ నివాళి కార్యక్రమానికి ఆహ్వానిస్తున్న డీఎండీకే నేతలు ఎల్కే సుదీష్, పార్థసారథి తదితరులు



చెన్నై, కలైవానర్ అరంగంలో మంగళవారం ఉదయం 'మాదక ద్రవ్యాల రహిత తమిళనాడు' అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో బహుమతులందుకున్న విద్యార్థులతో సమాచార శాఖ మంత్రి సామినాథన్



ఎంపీ, సీనియర్ న్యాయవాది విల్సన్, ఆయన కుమారుడు, న్యాయవాది రిచర్డ్‌సన్ విల్సన్‌లకు తన క్యాంపు కార్యాలయంలో క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుతున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

'బరోజ్'... ఫాంటసీ, అడ్వెంచర్ సినిమా

- మోహన్‌లాల్



గత 47 యేళ్ళుగా చిత్రపరిశ్రమలో ఉంటున్నాననీ, దర్శకుడిగా 'బరోజ్' తనకు తొలి సినిమా అని, దీన్ని ఫాంటసీ, అడ్వెంచర్ బాణీలో తెరకెక్కించినట్టు మలయాళ అగ్రనటుడు మోహన్‌లాల్ తెలిపారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని బుధవారం తమిళం, తెలుగు, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో విడుదల చేస్తున్నారు. దీన్ని పురస్కరించుకుని చిత్రం బృందం చెన్నైలో మీడియా సమావేశాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా హీరో మోహన్‌లాల్ పాల్గొని మాట్లాడుతూ, 'ఈ సినిమాను రెండు కెమెరాలతో త్రీడీ ఫార్మెట్‌లో చిత్రీకరించాం. ఫాంటసీ, అడ్వెంచర్ జోనర్‌లో రూపొందిన ఈ చిత్రం సరికొత్త అనుభూతినిస్తుంది. ప్రపంచంలోనే అత్యుత్తమ సినిమాటోగ్రాఫర్ సంతోష్ శివన్ ఛాయాగ్రహణం అందించారు. హాలీవుడ్ మ్యూజిక్ కంపోజర్ మార్క్ గిలియన్ రీరికార్డింగ్ పూర్తిచేశారు. ఇలా ఎంతోమంది గొప్ప టెక్నీషియన్లు ఈ చిత్రం కోసం పనిచేశారు. సినిమాలో ప్రతి పాత్ర, ప్రతి సన్నివేశాన్ని ప్రతి ఒక్కరూ పూర్తిగా ఎంజాయ్ చేస్తారు' అని పేర్కొన్నారు. క్రియేటివ్ హెడ్ రాజీవ్ కుమార్ మాట్లాడుతూ, 'ఈ సినిమా కోసం మోహన్‌లాల్‌తో కలిసి పని చేయడం యాదృచ్ఛికంగా జరిగింది. దేశంలోనే తొలి త్రీడీ సినిమా 'మైడియర్ కుట్టి చైతాన్'కు నేను అసిస్టెంట్ డైరెక్టరుగా పనిచేశాను. ఈ సినిమా వచ్చిన కొన్నేళ్ళ తర్వాత మోహన్‌లాల్‌తో కలిసి పని చేయడం సంతోషంగా ఉంది. ఈ సినిమా కోసం టెక్నాలజీని భారీ స్థాయిలో ఉపయోగించాం. దానికి మించి నటీనటుల నటన అద్భుతంగా ఉంది. సినిమా చూస్తుంటే త్రీడీ సినిమా అనే విషయాన్ని మరిచిపోతారు' అని అన్నారు. ఆశీర్వాద్ సినిమాస్, ఆంటనీ పెరంబావూర్ నిర్మాణ సారథ్యంలో రూపొందించారు.

చిత్రజ్యోతి

ఇళయరాజాకు 'విడుదలై' టీం అభినందన



ఇళయరాజాను అభినందిస్తున్న విజయ్ సేతుపతి, వెట్రిమారన్, ఎల్రెడ్ కుమార్

సూరి - విజయ్ సేతుపతి, మంజు వారియర్ ప్రధాన పాత్రలో వెట్రిమారన్ దర్శకత్వంలో వచ్చిన 'విడుదలై-2' చిత్రం ఈ నెల 20వ తేదీ విడుదలై ఘనవిజయాన్ని సొంతం చేసుకుంది. సినిమాకు కథాగమనంతో పాటు వెట్రిమారన్ టేకింగ్, మేకింగ్, ఇళయరాజా సంగీతం, విజయ్ సేతుపతి నటన హైలెట్‌గా నిలిచాయి. అదేసమయంలో సినిమాకు ప్రేక్షకుల నుంచి మిశ్రమ స్పందన వచ్చినప్పటికీ వసూళ్ళపరంగా ఆశించిన మేరకు ఉన్నాయి. దీంతో దర్శక నిర్మాతలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ చిత్ర విజయంలో కీలక పాత్ర పోషించిన చిత్ర సంగీత దర్శకుడు ఇళయరాజాను దర్శకుడు వెట్రిమారన్, నటుడు విజయ్ సేతుపతి, నిర్మాత ఎల్రెడ్ కుమార్ కలిసి అభినందనలు తెలిపారు. ఇదిలావుంటే, ఈ చిత్రం విడుదలైన తొలి మూడు రోజుల్లోనే రూ.25 కోట్ల మేర వసూలు చేసినట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. ఇపుడు క్రిస్మస్, వీకెండ్, కొత్త సంవత్సర సెలవులుండటంతో కలెక్షన్లు పెరిగే అవకాశం ఉందని ఫిల్మ్ ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి.

భరత్ హీరోగా 'మిస్టర్ భారత్'



ఫ్యాషన్ స్టూడియో, జి స్క్వాడ్, ది రూట్ సంస్థలు సంయుక్తంగా 'మిస్టర్ భారత్' పేరుతో ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాయి. నిరంజన్ కథ సమకూర్చి దర్శకత్వం వహించే ఈ చిత్రంలో భరత్ ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ చిత్రం క్లిప్స్ అభిమానులను అమితంగా ఆకట్టుకున్నాయి. సాధారణంగా యాక్షన్ లేదా క్రైమ్ థ్రిల్లర్ కథాంశాలను ఎన్నుకుని చిత్రాలను తెరకెక్కించే ఈ నిర్మాణ సంస్థలు ఇపుడు అందరూ ఆశ్చర్యపోయేలా ఈ మూవీని హాస్య కథా చిత్రంగా నిర్మిస్తున్నాయి. నిర్మాత జగదీష్ పళనిస్వామి ఈ వివరాలను వెల్లడిస్తూ, 'ప్రతిభావంతులైన 'ఫైనల్లీ' బృందంతో కలిసి పనిచేయడం సంతోషంగా ఉంది. భరత్, నిరంజన్ కలిసి తయారు చేసిన వీడియోలు ప్రపంచ వ్యాప్తంగా అభిమానుల దృష్టిని ఆకర్షించాయి. అందుకే 'మిస్టర్ భారత్' పేరుతో ఈ సినిమాను రూపొందిస్తున్నాం. గతంలో ఇదే టైటిల్‌లో ఏవీఎం సంస్థ రజనీకాంత్‌తో ఒక చిత్రాన్ని నిర్మించింది. ఇపుడు ఈ టైటిల్‌ను అడగ్గానే ఇచ్చినందుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. దర్శకుడు నిరంజన్ మాట్లాడుతూ, 'ప్రతి ఔత్సాహిక దర్శకుడు, నటీనటులకు ది బెస్ట్ సినిమా అందించాలని ఉంటుంది. అలాగే, అత్యుత్తమ నిర్మాణ సంస్థలతో కలిసి పనిచేయడం ఆనందంగా ఉంది. ఇది ఒక సింపుల్ స్టోరీ. పాత్ర చుట్టూనే కథ సాగుతుంది. ఇప్పటికే షూటింగ్ ప్రారంభించాం. త్వరితగతిన చిత్రీకరణ పనులు పూర్తి చేయాలని ప్లాన్ చేస్తున్నాం' అని పేర్కొన్నారు.

విజయకాంత్‌కు రుణపడివున్నా

- సంగీత దర్శకుడు దేవా



మీడియా సమావేశంలో దేవా

తన సినీ ప్రయాణంలో ఎన్నో పాటలు పాడినప్పటికీ 'వారారు వారారు అళగర్ వారారు' అనే పాట తనకు మంచి గుర్తింపుతో పాటు పేరు ప్రఖ్యాతలు తెచ్చిపెట్టిందని దానికి కెప్టెన్ విజయకాంత్‌కు రుణపడివున్నానని ప్రముఖ సీనియర్ సంగీత దర్శకుడు దేవా అన్నారు. దేవా ఆధ్వర్యంలో జనవరి 18వ తేదీ మదురైలో మ్యూజికల్ నైట్ జరుగనుంది. ఈ వివరాలను ఆయన తాజాగా వెల్లడించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, 'మదురైలో ప్రతియేటా జరిగే చిత్తిరై వేడుకల్లో 'వారారు వారారు అళగర్ వారారు' పాట వినిపిస్తూనే ఉంటుంది. నేను ఎన్నో పాటలు పాడినప్పటికీ ఈ పాటతో నాకు ప్రత్యేక గుర్తింపు వచ్చింది. ఈ విషయంలో దివంగత నటుడు విజయకాంత్‌కు రుణపడివుంటాను. ఈ పాటను నేను తొలిసారి మదురై గడ్డపై లైవ్‌లో పాడనున్నాను. ఈ అవకాశాన్ని కూడా విజయకాంత్ కల్పించారు. మదురైలో జరిగే సంగీత విభావరిలో నాతో పాటు గాయకులు మనో, అనురాధా శ్రీరామ్, అజయ్ కృష్ణ, సబేష్, మురళి, శ్రీకాంత్ దేవా సహా దాదాపు 60 మంది వరకు పాల్గొంటారు. తరాలు మారినప్పటికీ నాది, ఇళయరాజా సంగీతం స్థిరస్థాయిగా నిలిచిపోయినందుకు ధన్యుడని. యంగ్ జనరేషన్‌లో అనిరుధ్ సంగీతం ఇష్టం. అనేక చిత్రాల్లో నటించేందుకు అవకాశాలు వచ్చినా నేను అంగీకరించలేదు. సంగీత దర్శకుడుగా సూపర్‌స్టార్ రజనీకాంత్‌తో కలిసి పనిచేయాలని ఇష్టపడుతున్నాను' అని పేర్కొన్నారు.




మంచుకొండలు కాదు.. మనూరే!

ప్రకృతి బహు విచిత్రమైనది. ఒక్కోసారి కశ్మీరం అవతలుండే కాంచన జంగనూ, విశాఖ అవలవుండే లంబసింగ్ లోయనూ కూడా మన కళ్ల ముందుకు తెస్తుంది. మబ్బులు కమ్మిన మంగళవారం సాయంత్రం తిరుపతి ఫ్లై ఓవర్ మీదుగా తిరుచానూరు వైపు ప్రయాణిస్తున్న వారికి కనువిందు చేసిన దృశ్యం ఇది. తెల్లమబ్బుల ముట్టడిలో అప్పలాయగుంట నల్లకొండలు ఇలా కనిపించాయి.

- రేణిగుంట, ఆంధ్రజ్యోతి

హుండీ ద్వారా రూ.4.12 కోట్లు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 29 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

ఆదివారం నాటి హుండీ ఆదాయం : రూ.4.15 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 65,656

తలనీలాలు సమర్పించినవారు : 24,360

సేవా పరిమళం @ 160 ఏళ్లు





ఆగస్టమీలియస్ విగ్రహం

నాయుడుపేటలో 160 ఏళ్ల చరిత్రను సొంతం చేసుకున్న లూథరన్ చర్చి సేవకు చిరునామాగా నిలుస్తోంది. సేవలను విశ్వవ్యాప్తం చేసే క్రమంలో ఆగస్టమీలియస్ ఆధ్వర్యంలో 1865లో నాయుడుపేటలోని 15 ఎకరాల్లో ఈ చర్చి మొదలైంది. ఈ ప్రార్థనాలయం నేటికీ చెక్కుచెదరని చారిత్రాత్మక కట్టడాలకు తార్కాణంగా నిలుస్తుంది. నాడు బాగా వెనుకబడిన ఈ ప్రాంతంలో చర్చి ఆధ్వర్యంలో పలు విద్యాలయాలు ఏర్పాటయ్యాయి. వైద్య సేవలను దగ్గరకు చేర్చి బాధితులకు అక్కున చేర్చుకుంది. కుటుంబ ఆదరణ కోల్పోయిన, వితంతు, వృద్ధులను ఆగస్టమీలియస్ స్త్రీబా హోమ్ ఏర్పాటు చేసి అండగా నిలిచారు. జర్మనీ నుంచి మీలియస్ మనదేశంలో అడుగుపెట్టాక ఇక్కడి స్థితిగతులకు చలించిపోయారు. సేవకు అంకితం కావాలని సంకల్పించారు. ఇందులో భాగంగా చెన్నై, సూళ్లూరుపేట, నాయుడుపేట, రాజమండ్రి, గూడూరు, వెంకటగిరి, శ్రీకాళహస్తి, తిరుపతి, రాపూరు, కోడూరు, వాకాడు తదితర ప్రాంతాల్లో చర్చిలను ఏర్పాటు చేశారు. సేవామూర్తిగా పదుగురి గుండెల్లో నిలిచిపోయారు. 1887 మే 21న ఈ కరుణామయుడు నాయుడుపేట చర్చిలోనే తుదిశ్వాస విడిచారు. దీంతో మీలియస్ సమాధిని చర్చిలోనే ఏర్పాటు చేశారు.

- నాయుడుపేట, ఆంధ్రజ్యోతి

విద్యాకాంతులకు ప్రతీక





ఎస్ఏఎల్‌సీ చర్చి - క్రిస్మస్ సందర్భంగా ముస్తాబువుతున్న చర్చిలోని ప్రాంగణం

జర్మనీకి చెందిన డాక్టర్ మీలియస్ చొరవతో 1867లో గూడూరులో సెయింట్ పాల్ పీటర్స్ లూథరన్ (ఎస్ఏఎల్‌సీ) చర్చి ఏర్పాటైంది. ప్రార్థనలకే పరిమితం కాకుండా ఈ చర్చి సేవాపరిమళాలను వెదజల్లింది. ఇంగ్లీషు మీడియం పాఠశాల, వసతి గృహాన్ని నిర్వహించి అట్టడుడు వర్గాల్లో విద్యాజ్యోతులను వెలిగించింది. ఎస్ఎంజీ పాఠశాల ఎందరో విద్యార్థులకు బతుకుదారి చూపించింది. అప్పటిలోనే ఇంగ్లీష్ మీడియంలో ఇక్కడ బోధించేవారు. గూడూరుతో పాటు చిల్లకూరు, మనుబోలు, సైదాపురం, బాలాయపల్లి ప్రాంతాల నుంచీ వేల సంఖ్యలో ప్రజలు ఈ చర్చికి వచ్చేవారు. 157 ఏళ్ల చరిత్ర కలిగిన సెయింట్ పాల్ పీటర్స్ లూథరన్ చర్చిలో క్రిస్మస్ సందర్భంగా మతాలకు అతీతంగా ప్రజలు వేడుకల్లో పాల్గొంటారు.

- గూడూరు, ఆంధ్రజ్యోతి

పుత్తూరులో 117 ఏళ్ల చర్చి



పుత్తూరులో బ్రిటిష్ కాలంలో కోన్‌లాగా నిర్మించిన ఈ ఎత్తయిన చర్చి... పట్టణానికి మరో వారసత్వపు ఆభరణం. దక్షిణ భారత సెయింట్ లూథరిన్ చర్చి ఆధ్వర్యంలో 1907లో ఈ చర్చిని నిర్మించారు. 2007లో వందేళ్ల ఉత్సవాలను నిర్వహించారు. కిలోమీటరు నుంచి చూసినా కనిపించే ఈ భవనాన్ని క్రైస్తవులు భద్రంగా కాపాడుకుంటున్నారు. దాదాపు వంద మంది కూర్చుని ప్రార్థనలు చేసుకునేందుకు వీలుగా ఈ భవనం వుంది.

- పుత్తూరు, ఆంధ్రజ్యోతి

యూటీఎఫ్ అధ్యక్షుడిగా రాజశేఖర్



రాజశేఖర్ - ముత్యాలరెడ్డి - మధుసూదన్‌రెడ్డి

తిరుపతిరూరల్ (గాంధీరోడ్డు), డిసెంబరు24 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని యూటీఎఫ్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జిల్లా కౌన్సిల్ సమావేశాల్లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా జీజే రాజశేఖర్, ప్రధానకార్యదర్శిగా కె.ముత్యాలరెడ్డి, గౌరవాధ్యక్షుడిగా దండు రామచంద్రయ్య, సహాధ్యక్షులుగా ఎం.కుమారస్వామి, గీతమ్మ, కోశాధికారిగా కె.మోహన్‌బాబు, కార్యదర్శిగా బండి మధుసూదన్‌రెడ్డి (తిరుపతి), ఎస్.శేఖర్, ప్రభాకర్, సుధీర్, మస్తానయ్య, హరిబాబు, సురేష్, పద్మజ, విజయ్‌కుమార్, వెంకటకృష్ణ, ఆదినారాయణ, విజయశ్రీ, గోవర్ధన్‌రెడ్డి, హేమాంబరధరరావు, రాష్ట్ర కౌన్సిలర్లుగా నిర్మల, ముత్యాలరెడ్డి, రాజశేఖర్, వాసుదేవరావు, సదాశివరెడ్డి, సునీల, రమేష్ నాయుడు, నాగరాజు, కోటేశ్వరరావు, ఆడిట్ కమిటీ సభ్యులుగా మోహన్, శివకుమార్, నాగేశ్వరరావు, సురేష్, చంద్రశేఖర్, దీపిక, రవికుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

ముక్కంటి సేవలో జపనీయులు



శ్రీకాళహస్తి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని మంగళవారం 8 మంది జపాన్ దేశస్థులు దర్శించుకున్నారు. ఆలయంలో శిల్పకళ అద్భుతంగా ఉందని వారు పేర్కొన్నారు. ఆలయ సూపరింటెండెంట్ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ లోగోతో తిరుమలకు కారు



తిరుమల, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): టీటీడీ నిబంధనలకు విరుద్ధంగా తెలుగుదేశం పార్టీకి చెందిన లోగోతో ఓ కారు తిరుమలకు వచ్చింది. సాధారణంగా రాజకీయ గుర్తులు, జెండాలు, వ్యక్తుల ఫొటోలు, చిహ్నాలతో తిరుమలకు రావడం నిషేధం. వీటిని అలిపిరి వద్ద తనిఖీల్లో భద్రతా సిబ్బంది గుర్తించి అడ్డుకోవాలి. అయినా, మంగళవారం పద్మావతి ఏరియాలో ఓ వాహనంపై టీడీపీ లోగో ఉండటం చర్చనీయాశంగా మారింది. అలిపిరి వద్ద తనిఖీల లోపం వల్లే ఇలా జరిగిందన్న విమర్శలున్నాయి.

27న వాలీబాల్ జట్ల ఎంపిక

తిరుపతి(క్రీడలు), డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈ నెల 27న శాప్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సీనియర్ మెన్ అండ్ ఉమెన్ వాలీబాల్ జట్లను ఎంపిక చేయనున్నట్లు జిల్లా క్రీడాకాధికారి సయ్యద్‌సాహెబ్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు ఆ రోజున ఉదయం 7గంటలకు జనన ధృవీకరణపత్రం, ఆధార్, పాస్‌పోర్ట్‌సైజు ఫొటోలతో హాజరుకావాలని తెలియజేశారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చేనెల 7నుంచి 13వరకు జైపూర్‌లో జరిగే సీనియర్ పోటీలకు అర్హత సాధిస్తారని వివరించారు.

సైబర్ ఉచ్చులో శ్రీసిటి ఉద్యోగి

● ఖాతాలో రూ.లక్ష మాయం

సూళ్లూరుపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సైబర్ మోసగాళ్ల ఉచ్చులో పడి శ్రీసిటి ఉద్యోగి ఆర్ఎస్ రెడ్డి తన బ్యాంకు ఖాతాలో ఉన్న రూ.లక్ష పోగొట్టుకున్నారు. సూళ్లూరుపేటలో జరిగిన ఈ విషయం మంగళవారం వెలుగు చూసింది. ఈయన మొబైల్‌కు రెండు రోజుల కిందట ఓ యాప్ వచ్చింది. దీనిని సద్వినియోగం చేసుకొంటే సులభంగా నగదు సంపాదించవచ్చనే మెసేజీ యాప్‌లో వచ్చింది. ఆ యాప్‌ను ఓపెన్ చేయడంతో నాలుగు విడతలుగా ఈయన ఖాతాలో ఉన్న రూ.లక్ష వరకు డ్రా అయినట్లు మెసేజ్‌లు వచ్చాయి. దీంతో ఆయన పోలీసులను ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భీములవారిపాళెంలో బోటు షికారు

● జిల్లా పర్యాటకశాఖ అధికారి జనార్దనరెడ్డి

తడ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పక్షుల పండుగకు వచ్చే పర్యాటకులకు ఆహ్లాదాన్ని పంచడానికి భీములవారిపాళెం రేవులో బోటు షికారు ఏర్పాటు చేస్తున్నట్లు పర్యాటకశాఖ అధికారి జనార్దనరెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన భీములవారిపాళెం పడవల రేవును ఆర్డీవో కిరణ్మయి, డీఎస్పీ చెంచుబాబుతో కలిసి పరిశీలించారు. బోటు షికారు ఏర్పాట్లపై ఆరా తీశారు. రేవు పరిసరాలను శుభ్రం చేయాలన్నారు. బోటు షికారుకు పర్యాటకులు ఎక్కువ సంఖ్యలో వచ్చే ఆస్కారం ఉన్నందున 30 పడవల వరకు ఏర్పాటు చేయాలని మత్స్యకార నాయకులకు ఆర్డీవో కిరణ్మయి సూచించారు. ఈ కార్యక్రమంలో వన్యప్రాణి విభాగం డీఎఫ్‌వో హారిక, తహసీల్దారు శరత్‌బాబు, ఎంపీడీవో విజయకుమార్, సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ కొండపనాయుడు, సర్పంచు గీతాప్రకాష్, టీడీపీ నాయకులు బొమ్మన శ్రీధర్, సుధాకర్, జయపాల్, వాసు తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో ఆరుగురికి పదేళ్ల జైలు

● రూ.20 వేల జరిమానా

సూళ్లూరుపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో ఆరుగురు నిందితులకు పదేళ్ల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ నెల్లూరు పోక్సో కోర్టు తీర్పునిచ్చింది. సూళ్లూరుపేటకు చెందిన ఓ బాలికకు మోసపూరిత మాటలు చెప్పి లైంగికంగా వేధించిన ఆరుగురిపై 2014లో పోక్సో కేసు నమోదైంది. మంగళవారం నెల్లూరు జిల్లా పోక్సో కోర్టు న్యాయమూర్తి సిరిపిరెడ్డి సుమ విచారణ పూర్తిచేసి నేరం రుజువు కావడంతో నిందితులు మల్లపు భానుప్రకాష్, మల్లపు వెంకటేశ్వర్లు, మల్లపు సుభాషిణి, అక్కరపాక స్వాతి, అక్కరపాక రమేష్, రేపూరి మాల కొండయ్యకు పదేళ్ల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

లా కోర్సుల్లో ప్రవేశానికి రేపు స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ నిర్వహిస్తున్న లా కోర్సుల్లో ప్రవేశానికి గురువారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఉదయం 10 గంటలకు అడ్మిషన్ల కార్యాలయంలో సంప్రదించాలని వర్సిటీ అడ్మిషన్ల డైరెక్టర్ ఊకా రమేష్‌బాబు తెలిపారు.

నారావారిపల్లె సమగ్రాభివృద్ధికి

ప్రణాళికలు సిద్ధం చేయండి: ప్రద్యుమ్న



సమావేశంలో మాట్లాడుతున్న సీఎంవో కార్యదర్శి ప్రద్యుమ్న

శ్రీకాళహస్తి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): సీఎం స్వగ్రామమైన చంద్రగిరి మండలం నారావారిపల్లె సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సీఎంవో కార్యదర్శి ప్రద్యుమ్న సూచించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలోని పరిపాలనా భవనంలో మంగళవారం ఆయన జిల్లాలోని పలు అభివృద్ధి ప్రాజెక్టులపై అధికారులతో సమీక్షించారు. అసెట్స్ సర్వే చేపట్టాలని, స్వయంశక్తి ప్లస్, వృత్తి నైపుణ్యం యువతకు అవసరమైన పరిశ్రమలు, ఉపాధి శిక్షణ స్కిల్ ప్రొఫైల్ సిద్ధం కావాలన్నారు. జిల్లాలో తిరుమల, శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రాలు, సముద్రతీరం, ఐఐటీ వంటి కేంద్ర విద్యాసంస్థలు, ఈఎంసీ, శ్రీసిటీ, షార్, గుడిమల్లం ఆలయం వంటి విశేషమైన డైవర్సిఫైడ్ సిస్టం ఉండటం విశేషమన్నారు. యూనిక్ ప్రొడక్ట్ మిషనరీ ఉపయోగించి ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలన్నారు. మామిడికి ప్రత్యామ్నాయంగా ఉద్యానవన పంటలను ప్రోత్సహించాలన్నారు. కనీసం రెండు అటానమస్ డ్రోన్లనయినా అందుబాటులోకి తీసుకురావడం ద్వారా పోలీసు శాఖ అవాంఛనీయ సంఘటనలను అరికట్టవచ్చన్నారు. స్టాండ్‌అప్ ఇండియా, ఎంఎస్ఎంఈ తదితర పథకాల కింద బ్యాంకుల సహకారంతో కొత్తయూనిట్లు నెలకొల్పేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పీఎం సూర్యఘర్ యోజన, ఊర్జా మిత్ర పథకాల గురించి చర్చించారు. గ్రామీణ రోడ్లకు మరమ్మతులు, సిమెంటు రోడ్ల ఆవశ్యకతపై ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. గ్రామాల్లో ప్రతి కుటుంబం నుంచీ ఫ్యామిలీ ప్రొఫైల్ తయారు చేయాలన్నారు. జాతీయ రహదారుల పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.

సుడిగాలి పర్యటన

రేణిగుంట నుంచి నాయుడుపేట వరకు ఆరులేన్ల జాతీయ రహదారిని పరిశీలిస్తూ.. పనుల పరోగతిని ప్రద్యుమ్న ఆరాతీశారు. నాయుడుపేట ఔటర్‌రింగ్ రోడ్డు వద్ద పనులను పరిశీలించారు. ఇక నాలుగు శాతం పనులు మిగిలాయని రోడ్డునిర్మాణ సంస్థ నిర్వాహకులు వెల్లడించారు. అనంతరం శ్రీకాళహస్తీశ్వరుడిని దర్శించుకున్నారు.

నారావారిపల్లెలో ఇలా..

నారావారపల్లెలో చేపట్టబోయే పనుల గురించి కలెక్టర్ వెంకటేశ్వర్ వివరించారు. పాఠశాలల్లో అధునాతన మౌలిక సదుపాయాలు, డిజిటల్ తరగతి గదులను శ్రీసిటీ ద్వారా రూ.80లక్షల సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేస్తామన్నారు. యువతకు వృత్తి విద్య నైపుణ్య శిక్షణ.. పాడి పశువులకు గోకులాలు.. 242 స్వయం సహాయక మహిళా సంఘాలకు డ్రోన్ నిర్వహణ, ఈ-ఆటో కింద కొందరికి రుణ సదుపాయం కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, ఆర్డీవోలు భానుప్రకాష్‌రెడ్డి, రామ్మోహన్, డీపీవో సుశీలదేవి, అధికారులు పాల్గొన్నారు.

● తిరుమల నుంచి తిరుగు ప్రయాణంలో..

వేగం తెచ్చిన అనర్థం

● వృద్ధురాలి మృతి ● నలుగురికి తీవ్ర గాయాలు

● పరమేశ్వర మంగళం వద్ద ఘటన

● సురక్షితంగా బయట పడ్డ చిన్నారి



గాయపడిన వైష్ణినేతిలి



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు

పుత్తూరు అర్బన్, డిసెంబర్ 24(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని దర్శించుకుని చెన్నై కీలంబాకంకు బయలుదేరిన నెం.టీఎన్ 66 క్యూ 9263 కారు ప్రమాదానికి గురైంది. పుత్తూరు సమీపంలోని పరమేశ్వర మంగళం వద్ద ఉదయం 11.15 గంటలకు ప్రమాదం జరిగింది. ఇదే గ్రామం హరిజనవాడకు చెందిన ఐలయ్య భార్య శాంతకుమారి(60) రోడ్డు దాటుతుండగా కారు ఆమెను వేగంగా ఢీ కొంది. ఈ క్రమంలో ఆమె అక్కడికక్కడే మృతి చెందగా, అదుపు తప్పిన కారు రోడ్డు పక్కన ఉన్న బండరాయిని ఢీకొట్టింది. కారు నుజ్జు నుజ్జు అయింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన నలుగురు కుటుంబ సభ్యులు తల్లి సీతాలక్ష్మీ, తండ్రి పళనిస్వామి, కుమారుడు నవనీత కృష్ణ, కోడలు వైష్ణినేతిలికి తీవ్ర గాయాలయ్యాయి. చిన్నారి సురక్షితంగా బయటపడింది. ప్రమాదాన్ని గమనించిన గ్రామస్తులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను పుత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాద సమయంలో కారును నవనీత కృష్ణ నడుపుతున్నట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన శాంతకుమారి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అంత్యక్రియలకు హాజరైన వారిపై దూసుకెళ్లిన కారు



కారు దూసుకెళ్లడంతో దెబ్బతిన్న ద్విచక్ర వాహనాలు



మృతి చెందిన కొండారెడ్డి

● ముగ్గురికి తీవ్రగాయాలు ● ఒకరి మృతి

● పాక్షికంగా దెబ్బతిన్న పలు ద్విచక్ర వాహనాలు, ఆటో

ఏర్పేడు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): అంత్యక్రియలకు హాజరైన వారిపై కారు దూసుకెళ్లిన ఘనటలో వృద్ధుడు మృతి చెందగా ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని నచ్చనేరి పంచాయతీ దుర్గిపేరికి చెందిన గాది వెంకటేష్(35) సోమవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. వెంకటేష్ అంత్యక్రియలు మంగళవారం మధ్యాహ్నం 2గంటలకు గ్రామం వద్ద నిర్వహిస్తుండగా వెంకటగిరి నుంచి తిరుపతి వైపు వెళుతున్న కారు అదుపు తప్పి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో దుర్గిపేరికి చెందిన కొండారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డితో పాటు కృష్ణంపల్లికి చెందిన గెరటారెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. అంతేకాకుండా రోడ్డు పక్కనే ఉన్న పలు ద్విచక్ర వాహనాలు, ఆటో దెబ్బతిన్నాయి. తీవ్రంగా గాయపడిన వారిని స్థానికులు ఆటోలో తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కొండారెడ్డి(75) మృతి చెందాడు. మిగిలిన వారు చికిత్స పొందుతున్నారు. కొండారెడ్డికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు.

పరకామణి దొంగతనంపై 'ఎంక్వైరీ కమిషన్' వేయండి

● టీటీడీ చైర్మన్‌కు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి విజ్ఞప్తి



చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న భానుప్రకాష్

తిరుమల, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): శ్రీవారి హుండీ లెక్కింపుల పరకామణిలో దొంగతనం కేసుపై 'ఎంక్వైరీ కమిషన్' వేయాలంటూ టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడికి మంగళవారం సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. అనంతరం భానుప్రకాష్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. గతంలో పరకామణిలో పనిచేసిన రవికుమార్ దొంగతనం చేయగా కేసు పెట్టారని, పోలీసుల ఒత్తిడితో లోక్‌అదాలత్‌లో రాజీపడ్డామని అప్పుడు పనిచేసిన విజిలెన్స్ అధికారులు నివేదిక ఇచ్చారని, దానిపై అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. తిరుపతి, చెన్నైలోని రవికుమార్ ఆస్తులను టీటీడీకి బదిలీ చేశారన్నారు. ఈ పంచాయితీ ఏంటని ఆయన ప్రశ్నించారు. రాజీకి పొమ్మని చెప్పిన పోలీసు అధికారులు ఎవరో తెలియాలన్నారు. దీనిపై కమిషన్ వేసేంతవరకు బోర్డు సభ్యుడిగా పోరాడతానని చెప్పారు.

'పద్మావతి' సముదాయం లీజు రద్దుపైనా..

తిరుచానూరులోని టీటీడీకి చెందిన పద్మావతి యాత్రికుల వసతి సముదాయం కలెక్టరేట్‌కు ఇచ్చారని, దాని లీజు రద్దుపై పోరాటం కొనసాగిస్తానని భానుప్రకాష్‌రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం కలెక్టరేట్‌కు కేటాయించడంపై తాను హైకోర్టుకు వెళ్లానన్నారు. గత ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లి ట్రాన్సిట్ అకామిడేషన్ త్వరలోనే తెలియజేస్తామని, అప్పటివరకు టీటీడీకి నెలకు రూ.21.50 లక్షల అద్దెను జీఎస్టీసహా చెల్లిస్తామని తెలిపిందన్నారు. తాజాగా లీజును మరో మూడేళ్లకు పెంచడంతో పాటు క్లీనింగ్ కోసం రూ.7 లక్షలు కూడా టీటీడీనే ఇవ్వాలంటూ కలెక్టరేట్ నుంచి లేఖ వచ్చిందన్నారు. ఈ క్లీనింగ్ నిధులను ఆపడంతో పాటులీజు రద్దు చేయాలని చైర్మన్‌ను కోరానన్నారు.

రూ.20 లక్షల ఎర్రచందనం దుంగల స్వాధీనం

● ముగ్గురు ప్రధాన స్మగ్లర్ల అరెస్ట్



స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు, స్మగ్లర్లను అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

మంగళం, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా నాగలాపురం మండలం రెప్పాల తిప్ప సమీప అటవీ ప్రాంతంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం ఆకస్మిక దాడులు చేశారు. రూ.20లక్షల విలువైన 69 ఎర్రచందనం దుంగలతో పాటుగా ముగ్గురు ప్రధాన స్మగ్లర్లను, ఐదుగురు కూలీలను అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్స్ ఇంచార్జి, ఎస్పీ సుబ్బరాయుడు కథనం మేరకు.. టాస్క్‌ఫోర్స్ సిబ్బందికి అందిన సమాచారంతో సోమవారం రాత్రి రెప్పాల తిప్ప అటవీ ప్రాంతంలో ఆకస్మిక దాడులు చేశారు. అక్రమంగా రవాణా చేయడానికి సిద్ధంగా ఉంచిన 69 ఎర్రచందనం దుంగలను, కేవీబీపురానికి చెందిన సురేంద్ర, నాగలాపురానికి చెందిన మునివేలు, తమిళనాడు సేలం జిల్లాకు చెందిన మేస్త్రి సెల్వరాజ్ తొరైస్వామి అనే ముగ్గురు స్మగ్లర్లను, తమిళనాడుకు చెందిన ఐదుగురు కూలీలను అదుపులోకి తీసుకున్నారు. ఈ అక్రమ రవాణా వెనుక ఉన్న ప్రధాన స్మగ్లర్లను అరెస్టు చేయడానికి దర్యాప్తు చేస్తున్నారు. కేసు చేదనలో ప్రతిభ చూపిన ఎస్పీ శ్రీనివాస్, డీఎస్పీ ఎండీ షరీఫ్, ఆర్ఐ చిరంజీవి, ఇన్స్‌పెక్టర్ సురేష్ కుమార్, ఆర్ఎస్ఐ నరేష్, సిబ్బందిని ఇన్చార్జి సుబ్బరాయుడు ప్రత్యేకంగా అభినందించారు.